Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 115 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 17 మే 2023 | బుధవారం | పేజీలు : 4

## రాహుల్, ప్రియాంకలపై నడ్డా ఫైర్

అహ్మదాబాద్: కాంగ్రెస్ ఇంకెంత మాత్రం జాతీయ పార్టీగా ఉండబోదని, ఆ పార్టీ కేవలం అన్నాచెల్లెళ్ల పార్టీ అని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను పరోక్షంగా ప్రస్తావిస్తూ విమర్శించారు భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా. ఈ ఏడాది చివర్లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా అహ్మదాబాద్‌లో నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశంలోని అన్ని పార్టీలు కుటుంబ, వారసత్వ పార్టీలు అయ్యాయని విమర్శించారు. బీజేపీ ఒక్కటే జాతీయ పార్టీయని, కాంగ్రెస్ కొద్ది రోజుల్లోనే ఆ స్థానాన్ని కోల్పోనుందని ఆయన జోస్యం చెప్పారు.

# కాంగ్రెస్‌కు మంచి రోజులు వచ్చినట్లేనా!?

## తెలంగాణాలో ఒక్కసారిగా మారిన పొలిటికల్ సీన్ !



హైదరాబాద్ : కర్నాటక ఎన్నికల ఫలితాల తరువాత తెలంగాణా రాజకీయాల్లో గొప్ప మార్పు కనిపిస్తోంది. కాంగ్రెస్ మీద పొలిటికల్ ఫోకస్ కూడా పెరిగింది. కాంగ్రెస్ సీటు ఇస్తామంటే వచ్చే వాళ్ళు ఎక్కువగా ఉన్నారని అంటున్నారు. ఇక సీనియర్ నేత మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి లాంటి వారు సీట్ల కోసం డిమాండ్ పెట్టి మరీ కాంగ్రెస్ లోకి వచ్చే పరిస్థితి అయితే కనిపిస్తోంది అని అంటున్నారు. అంతే కాదు అటు బీజేపీని ఇటు బీయారెస్ ని వ్యతిరేకిస్తున్న వారు అంతా ఇపుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు అని టాక్. ఒక విధంగా కాంగ్రెస్ ని గెలుపు గుర్రం గా భావించే పరిస్థితి ఏర్పడుతోంది అని అంటున్నారు. కర్నాటకలో కాంగ్రెస్ కి లభించిన అప్రతిహత విజయం ఇపుడు పొరుగు రాష్ట్రం అయిన తెలంగాణాలో కొత్త కాంతులను వెదజల్లుతోంది. అదే విధంగా సరికొత్త ఆశలను పెంచుకొతంది అని అంటున్నారు. మరో వైపు చూస్తే రెండు సార్లు అధికారంలో ఉన్న బీయారెస్ మూడవసారి హ్యాట్రిక్ విజయం కొట్టాలని చూస్తోంది. కానీ అదంత ఈజీగా కనిపించడంలేదు ఈ నేపధ్యంలో త్రిముఖ పోరు ఉంటే ఓట్లు చీలి బీయారెస్ కి లాభించి ఉండేది అన్న ఒక అంచనా ఉంది. కానీ ఇపుడు చూస్తే సీన్ మారింది. బీయారెస్ లో కూడా కొంత మందిలో ఆలోచనలు మారుతున్నాయట. ఏమో గుర్రం ఎగరావచ్చు అన్నట్లుగా కర్నాటక ఫలితాలు తెలంగాణా జనంలో మూడ్ చేంజి చేసి కాంగ్రెస్ కి పట్టం కట్టినా ఆశ్చర్యపోనవసరం లేదని అంటున్నారు. దాంతో బీయారెస్ లో ఉంటూ అంత హ్యాపీగా లేని వారు అసంతృప్తి తో ఉన్న వారు ముందు చూపుతో ఉన్నవారు అంతా కలసి ఇపుడు పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి టచ్ లోకి వస్తున్నారు అని అంటున్నారు. మరో వైపు చూస్తే కాంగ్రెస్ లో ఇప్పటిదాకా లేనిది ఐక్యత. సీనియర్ నేతలు మోకాలడ్డే సీన్ ఉండేది. రేవంత్ రెడ్డి వంటి వారు పార్టీని జనాల్లోకి తీసుకుని వెళ్లే ప్రయత్నం చేస్తున్నా వెనకడుగు వేయించేవారు కనిపిస్తూనే ఉన్నారు. ఇపుడు అలాంటివారిని అసలు పట్టించుకోవద్దు అన్నదే కాంగ్రెస్ హై కమాండ్ ఆలోచనగా ఉంది అని అంటున్నారు. పార్టీని దిగలాగే వారు ఎవరైనా కూడా పక్కన పెట్టి వచ్చే వారితో పార్టీ మీద నమ్మకం ఉంచి పోరాడే వారితోనే ముందుకు సాగాలని కూడా పార్టీ పెద్దలు ఆలోచనలు చేస్తున్నారుట. ఇక కాంగ్రెస్ లో చూస్తే ప్రియాంకా గాంధీ తాజా టూర్ తో మంచి ఊపు వచ్చింది. ఇపుడు కర్నాటక ఫలితాలు తోడు అయ్యాయి. బీజేపీ అదే సమయంలో వెనకబడింది. రానున్న రోజుల్లో చూసుకుంటే బీయారెస్ బీజేపీల నుంచి కూడా పెద్ద ఎత్తున చేరికలు కాంగ్రెస్ లో ఉన్నా ఆశ్చర్యంలేదు అని అంటున్నారు. ఏది ఏమైనా కూడా కర్నాటకం తెలంగాణా రాజకీయాన్ని మార్చేసింది అని అంటున్నారు. కాంగ్రెస్ ని మంచి రోజులు వచ్చాయని కూడా అంతా భావిస్తున్నారు.

## జూన్ 4న కేరళకు నైరుతీ రుతుపవనాలు

హైదరాబాద్: ఈసారి కాస్త ఆలస్యంగా నైరుతీ రుతుపవనాలు ఇండియాలోకి ఎంటర్‌కానున్నాయి. జూన్ 4వ తేదీన నైరుతీ రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకనున్నట్లు ఇవాళ భారతీయ వాతావరణ శాఖ తెలిపింది. నైరుతీ రుతుపవనాలతో దేశవ్యాప్తంగా వర్షాలు కురవనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం భీకర రీతిలో హీట్‌వేవ్ కొనసాగుతున్న నేపథ్యంలో.. వర్షాకాలం కాస్త ఆలస్యంగా దేశంలోకి ప్రవేశించనున్నట్లు తెలుస్తోంది. గడిచిన 18 ఏళ్ల నుంచి భారతీయ వాతావరణ శాఖ.. నైరుతీ రుతుపవనా ల గురించి అంచనాలు వేస్తోంది. 2015 మినహాయిస్తే దాదాపు 2005 నుంచి అన్ని అంచనాలు కరెక్ట్ అయ్యాయి. సాధారణంగా జూన్ ఒకటో తేదీన కేరళలోకి రుతుపవనాలు ఎంటర్ అవుతాయి. ఒక వారం రోజులు అటూ ఇటూగా ఈ ప్రక్రియ కొనసాగుతుం టుంది. అయితే రుతుపవనాలను అంచనా వేసేందుకు ఐఎండీ ప్రత్యేక మోడల్‌ను డెవలప్ చేసింది. ఆ మోడల్ ప్రకారం .. రుతుపవనాల అంచనా ప్లస్ లేదా మైనస్ నాలుగుగా ఉంటుంది. ఐఎండీ మొత్తం ఆరు విధానాల్లో వర్షాకాల రాకను అంచనా వేస్తుంది.

## కాంగ్రెస్తో చేతులు కలుపుతున్న మమత.. మోడీకి సెగేనా?

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ దిగ్విజయం దక్కించుకున్న తర్వాత.. అనూహ్యమైన మద్దతు లభిస్తోంది. ఇప్పటి వరకు అంటీ ముట్టనట్టుగా ఉన్న పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తాజాగా కాంగ్రెస్ కు అనుకూలంగా వ్యాఖ్యానించారు. లోక్సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేసే చోట తాము పోటీ చేసేది లేదని మమతా బెనర్జీ చెప్పడం సంచలనంగా మారింది. ఇది నిజానికి అంత ఈజీ విషయం కాదు. బెంగాల్లో బలంగా ఉన్న ఒక అధికార పార్టీ అనూహ్యంగా తాను పోటీకి దూరంగా ఉంటున్నానని ప్రకటించడం.. సంచలనంగా మారింది. బీజేపీకి వ్యతిరేకంగా 2024 లోక్సభ ఎన్నికల్లో 'ఐక్య విపక్ష కూటమి' ఏర్పాటుకు చురుకుగా సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు సంచలనగా మారాయి. లోక్సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న చోట్ల టీఎంసీ మద్దతు ఇస్తుందని తెలిపారు. లోక్సభ ఎన్నికల్లో విపక్ష ఐక్యతకు సంబంధించి టీఎంసీ వ్యూహాన్ని మమతా బెనర్జీ స్పష్టం చేయడం ఇదే మొదటిసారి. దీంతో వచ్చే లోక్సబ ఎన్నికల్లో ప్రధాని మోడీకి వ్యతిరేకంగా కూటమి కట్టాలని భావిస్తున్న పార్టీలకు మరింత ఆక్సిజన్ అందినట్టు అయిందని అంటున్నారు పరిశీలకులు.

**ఏం జరిగిందంటే..** పశ్చిమ బెంగాల్ సెక్రటేరియట్లో జరిగిన మీడియా సమావేశంలో మమతా బెనర్జీ మాట్లాడారు. 'కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో అక్కడ ఆ పార్టీ పోరాడుతుంది. వారికి మేము సపోర్టు నిలుస్తాం. అందులో తప్పేమీ లేదు. అయితే వారు కూడా ఇతర రాజకీయ పార్టీలకు సపోర్టు నిలవాలి" అని అన్నారు.

సీట్ల కేటాయింపు ఫార్ములా విషయంలోనూ ప్రాంతీయ పార్టీలు ఎక్కడైతే బలంగా ఉన్నాయో అక్కడ వారికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. కాగా ఈ నెల 13వ తేదీన వెలువడిన కర్ణాటక ఫలితాల్లో బీజేపీ అధికారం కోల్పోయిన వెంటనే మమతా బెనర్జీ ఆ రాష్ట్ర ప్రజలకు సెల్యూట్ చేశారు. కాంగ్రెస్ పేరు మాత్రం ఆమె ప్రస్తావించ లేదు. ఒకప్పుడు కాంగ్రెస్లో ఉన్న మమతా బెనర్జీ ఆ తర్వాత పార్టీని వీడి టీఎంసీని ఏర్పాటు చేశారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ టీఎంసీ ఘనవిజయం సాధించింది. ఈ క్రమంలో బీజేపీకి వ్యతిరేకంగా 2024 లోక్సభ ఎన్నికల్లో విపక్ష ఐక్య కూటమి ఏర్పాటు అవసరాన్ని మమతా బెనర్జీ గట్టిగా చెబుతున్నారు. బీహార్ ముఖ్యమంత్రి



నితీష్ కుమార్ ఇటీవల ఆ ప్రయత్నాలను వేగవంతం చేశారు. మొత్తానికి తాజా వ్యాఖ్యలతో మమత కాంగ్రెస్కు చేరువ అయితే.. మోడీకి సెగ తప్పదనే అంచనాలు వస్తున్నాయి.

# లిస్టు పెద్దదిగానే



## బీజేపీలో ముఖ్యమంత్రుల జాబితా రెడీ...

హైదరాబాద్ : ఆలూ లేదు.. చూలూ లేదు.. కొడుకు పేరు సోమలింగం అట.. ఇదొక నాటు సామెత. తెలంగాణలో బీజేపీ పరిస్థితి కూడా అలాగే ఉందని చర్చ జరుగుతోంది. సంస్థాగతంగా ఇప్పుడిప్పుడే ఎదుగుతోంది బీజేపీ. క్రితం అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే స్థానంతో సరిపెట్టుకున్న ఆ పార్టీ బండి సంజయ్ ని అధ్యక్షుడిగా నియమించడంతో కొంత పుంజుకుంది.

ఇపుడు ప్రధాన ప్రతిపక్షం స్థానం కోసం పోరాడుతోంది. తొలుత బండి సంజయ్ ని అధ్యక్షుడిగా నియమించినపుడు కూడా పార్టీలో కదలిక లేదు. దుబ్బాక ఉప ఎన్నికతోనే అది ప్రారంభమైంది. అప్పటి ఎమ్మెల్యే రామలింగారెడ్డి మరణంతో వచ్చిన ఉప ఎన్నికలో బీజేపీ విజయం సాధించింది. ఇక్కడ బండి మేనియా కంటే రఘునందన్ రావు పోరాట పటిమే ఆయనను ఎమ్మెల్యే గా గెలిపించింది. ఇదే ఊపు జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కూడా చూపించింది బీజేపీ. దాదాపు సగం కార్పొరేషన్ సీట్లు గెలుచుకొని అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టించింది. ఇక్కడ బీజేపీ గెలుపులో బండి సంజయ్ మేనియా కొంత పనిచేసినా ఎక్కువ శాతం వరద ప్రభావిత బాధితుల వల్లే జరిగింది. వరద సాయం సక్రమంగా అందకపోవడంతో టీఆర్ఎస్ పై కోపంతో బీజేపీని గెలిపించారు. ఇక్కడ కాంగ్రెస్ బలంగా లేకపోవడం కూడా మరొక కారణం. ఆ తర్వాత నాగార్జున సాగర్ ఉప ఎన్నికల్లో బీజేపీ చతికిలపడింది. నోముల నర్సింహయ్య మరణంతో వచ్చిన ఈ ఎన్నికలో టీఆర్ఎస్ కు దీటుగా కాంగ్రెస్ నిలిచింది. ఇటీవల బీజేపీ గెలిచిన హుజూరాబాద్ ఉప ఎన్నిక ఫలితం కూడా ఆ పార్టీకి ఆయాచితంగా వచ్చిందే. అక్కడి ఓటర్లు కేసీఆర్ ను ఓడించాలనే లక్ష్యంతో ఈటెల రాజేందర్ ను ఏకపక్షంగా గెలిపించారు. ఇక్కడ పార్టీల పాత్ర నామమాత్రంగా మారింది. కాంగ్రెస్ శ్రేణులు కూడా ఈటెల వైపే మొగ్గు చూపారు. ఈ విజయాలన్నీ బీజేపీకి పైపై మెరుపులే. అంతేకానీ ఆ పార్టీ తెలంగాణలో సంస్థాగతంగా బలపడింది లేదు. ఇప్పుడిప్పుడే ఆ పని మొదలుపెట్టింది. కానీ అంతలోనే వర్గ పోరు ఆ పార్టీని చుట్టుముట్టింది. సీఎం స్థానం కోసం ఇప్పటి నుంచే అంతర్గతంగా కుస్తీలు పట్టుకుంటున్నారు. ఉమ్మడి కరీంనగర్ నుంచే ముగ్గురు ఆ సీటుపై కన్నేశారట. అందుకోసం ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ ప్రిపేర్ చేసుకుంటున్నారట.

బీజేపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు అధ్యక్షుడు బండి సంజయ్ ఈటెల రాజేందర్ ముగ్గురూ ముఖ్యమంత్రి పీఠంపైనే గురిపెట్టారట. ఒక్క ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే ముగ్గురు పోటీలో ఉంటే మిగతా జిల్లాల నుంచి ఎందరు ముందుకు వస్తారనే చర్చ జరుగుతోంది. బీజేపీ కలలు కనాల్సిందేనని.. ఆ పార్టీ 60 సీట్లు గెలిచేది లేదని.. ముఖ్యమంత్రులు అయ్యేది లేదని టీఆర్ఎస్ కాంగ్రెస్ విమర్శిస్తున్నాయి. చూడాలి మరి ఆ నేతల ఆశలు ఏ మేరకు నెరవేరుతాయో..!

# సంపాదకీయం

## తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ పెద్దల వరుస పర్యటనల ఆంతర్యమిదేనా?

ఓవైపు తెలంగాణలో ఓవైపు బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు.. మరోవైపు ఆంధ్రప్రదేశ్ లో అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహ ఆవిష్కరణ వేళ బీజేపీ పెద్దలు రెండు తెలుగు రాష్ట్రాల్లో వరుస పర్యటనలకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే హైదరాబాద్ లో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు మొదలయ్యాయి. వీటికి ప్రధాని మోదీ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. పనిలో పనిగా చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద రద్దీ పెరిగింది. గ్రేటర్ ఎన్నికల సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ భాగ్యలక్ష్మి దేవాలయం గురించి పదే పదే ప్రస్తావించారు. ఆ ఎన్నికల సమయంలోనే కేంద్ర హోం మంత్రి అమిత్ షా తో సహా పలువురు బీజేపీ నేతలు పాతబస్తీలో ఉన్న భాగ్మలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక ఇప్పుడు బీజేపీ కార్యవర్గ సమావేశాల సమయంలోనూ పలువురు కీలక నేతలు అమ్మవారి దర్శనం కోసం వస్తున్నారు. తాజాగా.. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ తో పాటుగా పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు. ముస్లిం మైనారిటీలు అధికంగా పాతబస్తీలో భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా హిందువులను తమ పార్టీ వైపు పూర్తి స్థాయిలో ఆకర్షించడమే బీజేపీ లక్ష్యమని చెబుతున్నారు. వచ్చే ఏడాది జరనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా హిందూ ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టడమే బీజేపీ ధ్యేయమని అంటున్నారు. కాగా బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో భాగంగా జూలై 3 రెండో రోజు ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేస్తారని తెలుస్తోంది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ ఇందుకు వేదిక కానుంది. ముఖ్యంగా కేసీఆర్ ప్రభుత్వం టీఆర్ఎస్ పై ప్రధాని ఘాటు వ్యాఖ్యలు చేస్తారని వార్తలు వస్తున్నాయి. అలాగే తెలంగాణపై ప్రత్యేక తీర్మానాన్ని కార్యవర్గ సమావేశాల్లో ప్రవేశపెడతారని పేర్కొంటున్నారు. ఇక జూలై 4న ప్రధాని ఆంధ్రప్రదేశ్ లోని పశ్చి మ గోదావరి జిల్లా భీమవరం సమీపంలో కాళ్ల మండలం పెద అమిరంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించనున్నారు. అక్కడ విప్లవ వీరుడు 30 అడుగుల అల్లూరి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఏపీ అధ్యక్షుడు సోము వీర్రాజు బీజేపీ ఎంపీలు జీవీఎల్ నరసింహారావు సీఎం రమేష్ వైఎస్సార్సీపీ నరసాపురం రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు తదితరులు పాల్గొననున్నారు. ఇక గన్నవరం విమానాశ్రయంలో ప్రధాని మోదీకి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ముఖ్యమంత్రి జగన్ ఇతర మంత్రులు స్వాగతం పలుకుతారని చెబుతున్నారు. అలాగే గన్నవరం నుంచి హెలికాప్టర్ లో ప్రధానితో కలిసి సీఎం జగన్ ప్రయాణిస్తారని తెలుస్తోంది. భీమవరంలో ఇప్పటికే కేంద్ర రాష్ట్ర భద్రతా దళాలు ముమ్మర తనిఖీలు చేస్తున్నాయి. 16 ఎకరాల్లో లక్ష మంది ప్రజలు హాజరయ్యేందుకుగా వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా ఆజాదీ అమృత్ మహోత్సవ్ లో భాగంగా అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని మోదీ ఆవిష్కరించనున్నారు. వేదికపై ప్రసంగాలను వీక్షించేందుకు గ్యాలరీలతోపాటు భీమవరం టౌన్ పరిసరాల వరకు ఎల్ఈడీ స్క్రీన్లు సిద్ధం చేశారు. ప్రధాని రాకపోకలకు వీలుగా నాలుగు హెలిప్యాడ్లు సిద్ధం అయ్యాయి. ప్రధాని వేదికతో పాటుగా సమీపంలోనే మరో వేదిక సిద్ధం చేసారు. ఆ వేదికపైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# ధాన్యం డబ్బుకోసం ఎదురుచూపులు



ఆదిలాబాద్ : జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులకు పూర్తిస్థాయిలో చెల్లింపులు జరపకపోవడం పట్ల అంతటా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత కొద్దిరోజుల నుంచి రైతుల ధాన్యం డబ్బుల కోసం కొనుగోలు కేంద్రాలతో సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ స్పందన కనిపించడం లేదన్న ఆరోపణలున్నాయి. ప్రతీఏటా ఇదే మాదిరి చెల్లింపుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుత రబీలో మొత్తం రైతుల నుంచి 1,19,719 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. దీనికి సంబంధించి రూ.234 కోట్లను 28,382 మంది రైతులకు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు 19500 మంది రైతులకు మాత్రమే రూ.152 కోట్లను చెల్లించారు. మిగతా 8882 మంది రైతులకు దాదాపు రూ.82 కోట్లను చెల్లించాల్సి ఉంది. రైతుల నుంచి డీఆర్డీఏ, పీఏసీఎస్, డీసీయంయస్, జీసీసీలు ధాన్యాన్ని కొనుగోలు చేశాయి. అయి తే 182 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదట్లో కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ఏర్పాటు చేయడం అలాగే కొనుగోలు కేంద్రాల్లో సరియ్యైన సౌకర్యాలు కల్పించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే చాలాసార్లు వర్షాలు కురియడంతో తమ ధాన్యం కూడా తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయకపోవడంతో మొదట్లో రైతులకు ఆటంకాలు తలెత్తాయి. ఎట్టకేలకు కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసినప్పటికీ చెల్లింపుల విషయంలో మాత్రం ప్రభుత్వం మొండి వైఖరిని అవలంభిస్తుండడం పట్ల రైతులు ఆక్షేపణ వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రైతులకు రూ.82 కోట్లను చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఈ చెల్లింపులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారోననే అంశంపై అధికారులు నోరు విప్పడం లేదు. ఇప్పటి వరకు రూ. 234 కోట్లను చెల్లించామని, మిగతా డబ్బులను కూడా కొద్దిరోజుల్లోనే చెల్లిస్తామంటూ సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నప్పటికీ రైతులకు మా త్రం ఆ మాటలపై నమ్మకం నెలకొనడం లేదంటున్నారు. మొత్తం 182 కొనుగోలు కేంద్రాల్లోకాగా జిల్లావ్యాప్తంగా 182 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా 28,382 మంది రైతుల నుంచి 1,19,719 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో నుంచి డీఆర్డీఏకు సంబంధించిన 32 కొనుగోలు కేంద్రాల్లో 14,319 యంటీఎస్‌లు, పీఏసీఎస్ కింద ఏర్పాటు చేసిన 85 కొనుగోలు కేంద్రాల్లో 51,488 యంటీఎస్‌లు, డీసీయంయస్ పరిధిలోని 61 కొనుగోలు కేంద్రాల్లో 52,792 ఎంటీఎస్‌ల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. దీంతో పాటు జీసీసీ ద్వారా ఏర్పాటు చేసిన 4 సెంటర్‌లలో 1118 ఎంటీఎస్‌ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయితే ఈ కొనుగోలు కేంద్రాల్లో కోతలపైనా రైతులు చాలా సందర్భాల్లో ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ఆందోళనలకు దిగిన సందర్భాలు సైతం ఉన్నాయి. క్షేత్రస్థాయిలో ఎదురైన అన్ని ఇబ్బందులను అధిగమిస్తూ అధికారులు మాత్రం హడావిడిగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసి చెల్లింపుల అంశంపై ప్రస్తుతం పెద్దగా దృష్టి సారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెల్లించాల్సింది రూ. 82 కోట్లురైతులకు దాదాపు రూ. 82 కోట్లను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బుల కోసం 8882 మంది రైతులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రైతులకు మాత్రం పూర్తిస్థాయిలో డబ్బులు అందకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.మొదటి నుంచి సమస్యలేధాన్యం కొనుగోలు ప్రక్రియను మొదటి నుంచి సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. గతానికి భిన్నంగా ఈ సారి కొనుగోలు కేంద్రాలు దాదా పు రెండు నెలల ఆలస్యంగా ప్రారంభించారు. ప్రభుత్వం మొదట్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయమై ఎక్కడా కూడా స్పష్టతనివ్వలేదు. కేంద్రప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయబోమని ప్రకటించడంతో గందరగోళం ఏర్పడింది. ప్రభుత్వం సైతం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి కేంద్రంపైనే ఆధారపడడంతో రైతులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయితే రైతుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత రావడంతో పాటు వారు క్రమంగా ఆందోళన భాట పట్టడంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉప సంహరించుకొని కొనుగోలు ప్రక్రియకు షరతులు విధించింది. దీంతో సాధారణ రైతాంగం తీవ్ర ఆందోళనకు గురైంది. ఎట్టకేలకు ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా 182 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ ప్రక్రియను ముందుకు నడిపించింది. రైస్‌మిల్లర్ల అభ్యంతరాలను సైతం పక్క న పెట్టి కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించింది. మరోవైపు ప్రకృతి కూడా అన్నదాతను తీవ్రఇక్కట్లకు గురి చేసింది. ఇలా అనేక సమస్యలను అధిగమించి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసినప్పటికి సంబంధిత అధికారులు ధాన్యం డబ్బుల చెల్లింపుల విషయంలో నాన్చివేత ధోరణి అవలంభిస్తుండడం పట్ల రైతాంగంలో అసం తృప్తి నెలకొంటోందంటున్నారు. వడ్ల పైసలు రాక చాలా ఇబ్బంది అవుతుందివడ్లు అమ్మి 20 రోజులు అవుతున్నా చేతికి డబ్బు లు మాత్రం అందలేదు. డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియడం లేదు. అధికారులు పట్టించుకుని తొందరగా డబ్బులు వచ్చేలా చూడాలి.అరుగుల గంగన్న, రైతు, గ్రామం బొప్పారం, మండలం సోన్70 శాతం మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశాంఈ విషయమై జిల్లా అడిషన ల్ కలెక్టర్ రాంబాబును సంప్రదించగా కొంత మంది రైతులకు ధాన్యం డబ్బులు రాని మాట వాస్తమే అన్నారు. కానీ ఇప్పటి వరకు 70 శాతం మంది రైతుల ఖాతాల్లో డబ్బులు వేశా మన్నారు. మిగతా 30 శాతం మంది రైతులకు డబ్బులు రావాల్సి ఉంద న్నారు. మిగతా డబ్బులు కూడా ఒకటి రెండు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బుల జమ చేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

– రాంబాబు, జిల్లా అడిషనల్ కలెక్టర్

డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నాండబ్బులు రాక చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం డబ్బులు అ మ్మి నెలలు గడుస్తున్నప్పటికీ డబ్బులు రావటం లే దు. వ్యవసాయం కోసం, ఇంటి అవసరాల కోసం బయట అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పిల్లలకు స్కూల్ ఫీజు కడదామంటే జేబుల పైసలు లేవు. అధికారులు రైతుల బాధలు అర్థం చేసుకొని వెంటనే డ బ్బులు జమ అయ్యేలా చూడాలి.

# అన్నదాతలకు ఊరట

జగిత్యాల : అన్నదాతలకు ఊరట లభించింది. ఎట్టకేలకు రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమ అవుతుండటంతో వ్యవసాయపనులు ఊపందుకోనున్నాయి. అంతే కాకుండా రైతు బంధు పథ కం ఈ యేడాది వానాకాలంలో కొత్తగా నమోదైన రైతులకు సైతం వ ర్తింప జేసేందుకు అధికారులు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. జి ల్లాలో రైతు బంధు డబ్బులు వారి వారి ఖాతాల్లో జమ చేయడం అధి కారులు షురూ చేశారు. దీంతో పంటల పెట్టుబడికి ఎదురుచూస్తున్న రైతులకు ఊరట లభించనుంది. ఈనెల 28వ తేదీ నుంచి రైతు బంధు సొమ్ము జమ చేయడానికి అవసరమైన నిధులు విడుదల చేశామని వ్య వసాయ శాఖ అధికారులు ప్రకటించారు. జిల్లాలో 2,27,268 మంది రైతులకు ప్రయోజనం...జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 2022 వానాకాలానికి సంబంధించి 2,27,268 మంది రైతులకు రైతుబంధు పథకం కింద ప్రయోజనం కలగనుంది. సంబంధిత రైతులకు రూ. 212.26 కోట్లు రైతుబంధు పథకం కింద ఖాతాల్లో జమ కానుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు అధికా రులు పూర్తి చేశారు. గత యాసంగిలో 2,10,532 మంది రైతులకు 207.19 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ప్రస్తుత సీజన్‌లో రైతుల సంఖ్య పెంపుగా ఉంది. జిల్లా వ్యాప్తంగా 2,27,268 మంది రైతులు ప్రయోజనం పొంద నుండగా ఇందులో బీర్‌పూర్ మండలంలో 8,135 మంది రైతులు, బు గ్గారంలో 7,185, ధర్మపురిలో 15,734, గొల్లపల్లిలో 16,056, ఇబ్రహీం ప ట్నంలో 10,313, జగిత్యాల 5,384, జగిత్యాల రూరల్ 16,611, కథలాపూ ర్‌లో 13,001 మంది రైతులున్నారు. కొడిమ్యాలలో 11,736, కోరుట్ల 13,169, మల్లాపూర్ 14,976, మేడిపల్లి 14,136, మెట్‌పల్లి 16,437, పెగడపల్లి 13, 573, రాయికల్ 14,740, సారంగపూర్ 7,340, వెల్గటూరు 17,601 మంది రైతులు ప్రయోజనం పొందనున్నారు.ముందుగా చిన్న కారు రైతులకు..ప్రభుత్వం విడుదల చేసిన ఐతు బంధు డబ్బులు ముందుగా ఎకరం ఉన్న వారికి తర్వాత రెండు, మూడు ఎకరాల వారి, ఇలా రైతుల ఖాతా ల్లో జమ అవుతాయని జిల్లా వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. చిన్న, సన్న కారు రైతులే పెట్టుబడి కోసం ఎక్కువగా ఇబ్బందులు పడే అవకాశం ఉంది. దీంతో ముందు వారికి డబ్బులు వస్తే ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నం కానున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పట్టాదారుల్లో సుమారు లక్ష ఎకరాల మేరకు చిన్న, సన్న కారు రైతులే ఉండడం గమనార్హం.కొత్తవారికి అవకాశం...జిల్లాలో ఇప్పటివరకు రైతుబంధు పథకం కింద సాయం పొందుతున్న రైతులకు తోడుగా కొత్తవారికి సైతం ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ప్రస్తుత సీజన్ నుంచి కొత్తవారికి సైతం సాయం అందించనున్నారు. 2022 జూన్ 22 వరకు కొత్తగా పాసుపుస్తకాలు పొంది అర్హత కలిగిన రైతుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 8,919 మంది రైతుల వివరాలు రైతు బంధు పోర్టల్‌లో చేర్చారు. కొత్తగా పాసుపు స్తకాలు పొందిన రైతులు సంబంధిత ఏఈవోల వద్ద రైతు బంధు కోసం జూలై 10వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచి స్తున్నారు. ఇందుకు దరఖాస్తు ఫారం, భూమి పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్‌లను వెంట తీసుకొని వెళ్లాలని సూచిస్తున్నారు. గత యేడాది నుంచి కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం వచ్చిన వారి వివరాలను క్షేత్రస్థాయిలో ఏఈవోలు ట్యాబ్‌లలో న మోదు చేస్తున్నారు. క్లస్టర్ల వారిగా ఉన్న ఏఈవోలకు ప్రత్యేక లాగిన్‌ను ప్ర భుత్వం అందించింది. ఇటీవల భూముల క్రయ విక్రయాలు, యాజమా న్య హక్కుల బదిలీ, మార్పులు, చేర్పులు, వారసత్వ పట్టాల మార్పిడి చేసుకున్న రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు అందాయి. సవరణలకు అవకాశం...ప్రభుత్వం రైతుబంధు పోర్టల్‌లో నమోదైన వివరాల్లో సవరణలు చేసు కునేందుకు అవకాశం కల్పించింది. గత యాసంగి సీజన్‌లో పెట్టుబడి సా యం కింద జమ అయిన నగదును కొందరు బ్యాంకర్లు పంట రుణాల కింద జమ చేసుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఇలాంటి పరిస్థితులు రాకుండా రుణ ఖాతాల స్థానంలో జమ ఖాతాల వివరాలు పోర్టల్‌లో చే ర్చేందుకు అవకాశం కల్పించింది. రైతులకు సంబందించిన ఫక్షన్ నంబ రు కూడా మార్చుకునే వీలును కల్పించింది. ప్రభుత్వం కల్పించిన అ వకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పల్లెల్లో రైతులకు వ్యవసాయ అ ధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కాగా భూ విస్తీర్ణంలో ఎలాంటి మా ర్పులు జరగకపోయినప్పటికీ రైతుల సంఖ్య ప్రతీ సీజన్‌లో పెరుగు తోం ది. వారసత్వంగా ఉన్న భూమి అన్నదమ్ములు పంచుకోవడం, ఉన్న భూమిని ఆర్థిక అవసరాలకు అమ్ముకోవడం తదితర కారణాల వల్ల రైతుల సంఖ్య పెరుగుతోంది. సంబంధిత రైతులంతా కస్లర్ల వారీగా ఏఈవోల వద్ద వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అన్నదాతల హర్షం...ప్రభుత్వం ప్రతీయేటా రైతుబంధు డబ్బులను సీజన్‌కు ముందుగా రైతు ఖాతాల్లో వేస్తుండడం జరిగేది. ప్రస్తుత సీజన్ ప్రారంభమైనా రై తుల ఖాతాల్లో డబ్బులు పడలేదు. దీంతో పెట్టుబడి కోసం రైతులు వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లడం, షాపుల్లో ఉద్దెరలు తీసుకునేందుకు ప్రయత్నాలు చేశారు. మరికొందరు రైతులు చేతిలో డబ్బులు లేక ఇప్ప టికీ పనులు ప్రారంభించలేదు. ఈ పరిస్థితుల్లో రైతు బంధ పథకం కింద డబ్బులు విడుదల కావడంతో జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రైతు పక్షపాతి సీఎం కేసీఆర్‌చీటి వెంకట్రావు, జిల్లా రైతు సమన్వయ సమితి నాయకులుముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతిగా అవసరమైన పనులు చేస్తున్నా రు. గతంలో ఎన్నడూలేని విధంగా టీఆర్ఎస్ సర్కారు హయాంలో రైతు ల సంక్షేమానికి అవసరమైన అనేక కార్యక్రమాలను సీఎం కేసీఆర్ నేతృ త్వంలో నిర్వహిస్తున్నారు. రైతుల కష్టాలను గట్టెక్కించడానికి సీఎం కేసీ ఆర్ చేస్తున్న కృషి సంతోషకరం. రైతుబంధు సాయం యేటా రెండు సీజన్‌లలో అందిస్తుండడం వల్ల రైతులకు ఆర్థిక ప్రయోజనాలు అందుతున్నాయి.సద్వినియోగం చేసుకోవాలిసురేశ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, ప్రభుత్వం పంటల చేసుకోవాలి.

# ఇసుక తవ్వకాల్లో ఇష్టారాజ్యం

సిరిసిల్ల) : మానకొండూరు మండలంలోని శ్రీనివాస్‌నగర్, లింగాపూర్, వెల్ది, ఊటూర్ గ్రామాల పరిధిలోని మానేరు వాగులో ఇసుక తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. సాండ్‌ట్యాక్స్ నిబంధనలు పాటించకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ఆయా గ్రామాల పరిధిలో ఇసుక రీచ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇసుకరీచ్‌ల వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్సార్వోల నిర్వాహకంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. సాండ్‌టాక్స్ ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మాత్రమే ఈ రీచ్‌ల ద్వారా ఇసుకను సరఫరా చేయాల్సి ఉంటుంది. ప్రతి రోజు ఒక ట్రాక్టర్‌కు సాండ్‌ట్యాక్స్ ద్వారా ఒకటి నుంచి రెండు ట్రిప్పులు మాత్రమే సమాచారం అందుతుంది. సదరు సమాచారాన్ని పరిశీలించిన తర్వాత ఎస్సార్వోలు ట్రాక్టర్లను ఇసుక రీచ్‌లోకి అనుమనుతులు ఇవ్వాలి. కానీ కొంతమంది ఇసుక యజమానులతో ఎస్సార్వోలు కుమ్మక్కై సాండ్



ట్యాక్స్ నుంచి ఎలాంటి సందేశం లేకుండానే ట్రాక్టర్లను ఇసుక రీచ్‌లలోకి అనుమతిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇసుకరీచ్‌ల నుంచి ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో బుకింగ్ పర్మిషన్ పొంది ఇసుక తరలించాల్సి ఉంది. కాగా అక్రమార్కులు రాత్రి నుంచి ఉదయం వేళల్లో సైతం ఎస్సార్వోల అండ దండలతో ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు పోలీసులు దాడి చేసి ట్రాక్టర్లను పట్టుకున్నా అక్రమార్కులు ఇసుక రవాణాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# మహిళకు 'ఉపాధి'

సిరిసిల్ల) : ఉపాధిహామీ పనులు గ్రామీణ ప్రాంతాల్లోని వలసలకు అడ్డుకట్ట వేస్తోంది. ఉన్న ఊళ్లలోనే ఉపాధి పొందే వెసులుబాటు కల్పిస్తోంది. పెద్ద పెద్ద చదువులు చదువుకోని మహిళలకు, ఇతర ప్రాంతాల్లో పనిచేయలేని మహిళలలకు ఉపాధి హామీ ఆర్థికంగా ఊతం ఇస్తోంది. కుటుంబ పోషణలో ఆర్థికంగా మహిళలు చేదోడుగా నిలుస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో చేపడుతున్న ఉపాధిహామీ పనుల్లో మహిళల హాజరు శాతమే ఎక్కువగా ఉంది. అన్ని పనుల్లోనూ భాగస్వాములు అవుతున్నారు. వ్యవసాయ పనుల కంటే ఉపాధి పనులకే ఎక్కువ మంది మహిళలు వెళ్లడం గమనార్హం. జిల్లాలో 1,0,60,00 జాబ్ కార్డులు ఉండగా 2.31 లక్షల ఉపాధి కూలీలు ఉన్నారు. 6,195 శ్రమశక్తి సంఘాలు ఉన్నాయి. సంఘాల పరిధిలో 1,20,303 మంది కూలీలు ఉన్నారు. 2022-23 సంవత్సరంలో 46.49 లక్షల పనిదినాలు కల్పించే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు ఉపాధి హామీ ద్వారా 32,975 కుటుంభాల్లో 45,758 కూలీలకు ఉపాధి కల్పించారు. జిల్లాలో 49,605 మంది మహిళలురాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 మండలాలు, 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలోని ఉపాధి హామీ కూలీల్లో ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 76,825 మంది కూలీలకు ఉపాధి అందించారు. ఇందులో మహిళలు 49,605 మంది ఉపాధి పనులకు వెళ్తే పురుషులు 27,220 మంది ఉన్నారు. మహిళలు 8 లక్షల పనిదినాలు, పురుషులు 4 లక్షల పనిదినాలను పొందారు. మహిళలు రూ. 14.40 కోట్ల



కూలీని పొందారు. పురుషులు రూ.7.94 కోట్ల కూలి పొందారు. పాంఫాండ్, మ్యాజిక్ సోప్ కిట్, పల్లె ప్రకృతి వనాలు, కందకాలు, హరితహారం వంటి పనుల్లు పనిచేస్తున్నారు. కొత్త వి?ధానంతో నేరుగా వేతనాలు ఉపాధిహామీ పనుల్లో రాష్ట్ర ప్రభుత్వ పెత్తనానికి బ్రేక్ పడింది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే అజమాయిషీ చేస్తోంది. ఇందుకోసం ఎన్ఐసీ సర్వర్‌ను అందుబాటులోకి తెచ్చింది. కూలీలకు సంబంధించిన వేతనాలు, పనుల వివరాలు నేరుగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్‌లోనే అప్‌లోడ్ చేస్తున్నారు. వేతనాలు కూడా కూలీల ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు కూలీలు సరాసిరి 187.46 రోజుకు కూలి పొందుతున్నారు. జిల్లాలో గత మే వరకు ఉపాధి హామీ ద్వారా కంపోస్ట్ షెడ్‌లు 255, వైకుంఠధామాలు 73, పల్లె పకృతి వనాలు 267 నిర్మించారు. వ్యవసాయ కల్లాలు 1681 మంజూరు కాగా 342 పూర్తి చేశారు. 1105 ప్రగతిలో ఉన్నాయి. 1269 పశువుల పాకల నిర్మాణాలకు 586 పూర్తి చేశారు. 297 ప్రగతిలో ఉన్నాయి. గొర్రెలు, మేకల పాకల నిర్మాణాలు 421 మంజూరు కాగా 21 పూర్తి చేశారు. 171 ప్రగతిలో ఉన్నాయి. మ్యాజిక్ సోప్‌కిట్‌లు 47,241 మంజూరు కాగా 26,974 పూర్తి చేశారు. 905 ప్రగతిలో ఉన్నాయి. ఫాంపాండ్ 2167 మంజూరు కాగా 1227 పూర్తి చేశారు. 423 ప్రగతిలో ఉన్నాయి. గ్రామ సంతలు 20 మంజూరు కాగా ఒకటి మాత్రమే పూర్తి చేశారు. ఐదు ప్రగతిలో ఉన్నాయి.

# సింగరేణి కార్మికులకు ఉచిత బీమా

ఇల్లెందు : సింగరేణి సంస్థలో పని చేసే అధికారులు, కార్మికులకు ఉచిత ప్రమాద బీమా అందించేందుకు యాజమాన్యం శ్రీకారం చుట్టింది. గతంలో ఉన్న రూ.40 లక్షలను రూ.62 లక్షలకు పెంచి బీమా వర్తించే విధంగా చర్యలు చేపట్టింది. ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ప్రమాద బీమా పొందే మార్గాన్ని యాజమాన్యం సింగరేణి ఉద్యోగులకు కల్పిస్తుంది. ఉద్యోగులు వారి బ్యాంకు ఖాతాను కార్పొరేట్ జీతం(సాలరీ) ఖాతాగా మార్చుకున్న నాటి నుంచి ఈ ప్రమాద బీమా వర్తించేలా యాజమాన్యం బ్యాంకు అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంది. సేవింగ్స్ అకౌంట్ ఉన్న ప్రతి సింగరేణి ఉద్యోగి తమ అకౌంట్లను సాలరీ అకౌంటుగా మార్చుకుని లబ్ధి పొందాలని యాజమాన్యం పిలుపునిస్తుంది. ఈ పథకం సింగరేణి సంస్థ ఉన్న ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని ప్రతి కార్మికుడికి వర్తించనున్నట్లు తెలిపింది.

కలిగే ప్రయోజనాలు.. సింగరేణిలోని మొత్తం 11 ఏరియాల్లో మొత్తం 44 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. వారు వేతనాల అకౌంట్లు ఉన్న బ్యాంకుకు వెళ్లి కార్పొరేట్ సాలరీ అకౌంట్లుగా మార్చాలని దరఖాస్తు




ఇస్తే సరిపోతుంది. వారి అకౌంట్లు కార్పొరేట్ సాలరీ అకౌంట్లుగా మార్చడంతో ఆయా బ్యాంకులను బట్టి రూ.40 లక్షల నుంచి రూ.62 లక్షల వరకు బీమా వర్తిస్తుంది.అకౌంట్లను మార్చని వారికి మాత్రం ప్రమాద బీమా వర్తించదు. కార్పొరేట్ సాలరీ అకౌంటుగా మార్చడంతో జీరో బ్యాలెన్స్ సౌకర్యం, ఇంటి రుణం, వాహన రుణం, పర్సనల్ రుణం తీసుకున్న క్రమంలో ప్రాసెసింగ్ ఫీజులో రాయితీ ఉంటుంది.ఉచిత చెక్కు బుక్కు, తాత్కాలిక ఓవర్ డ్రాఫ్టు, లాకర్స్ ఛార్జీలలో రాయితీలు, విదేశీ విద్యా రుణంలో రాయితీ వంటి తదితర సదుపాయాలు వర్తిస్తాయి.

బ్యాంకు ఖాతాను మార్చుకోండి

ఏరియా జీఎం ఎం.షాలేము రాజు

సింగరేణి సంస్థలో పని చేసే ప్రతి ఉద్యోగి వారి అకౌంట్లను కార్పొరేట్ సాలరీఅకౌంట్‌గా మార్చుకుని ప్రమాద బీమా సౌకర్యాన్ని పొందాలి. తమ కుటుంబ సభ్యులు భవిష్యత్తు, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అకౌంట్‌ను మార్చుకోవాలి. ఉద్యోగులు వారి, వారి బ్యాంకులకు వెళ్లి అకౌంట్ మార్చాలని కేవలం ఒక్క దరఖాస్తు ఇస్తే సరిపోతుంది.

డైరెక్టర్ పాకు ధన్యవాదాలుఎస్అండ్‌పీసీ ఉద్యోగి కుమార్

సింగరేణి సంస్థ డైరెక్టర్ (పా) కార్మికుల కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని ఈ అవకాశాన్ని కల్పించారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. డైరెక్టర్ పాకు ధన్యవాదాలు.

# ఖమ్మం సర్వజనాసుత్రి తల్లిపాల బ్యాంకుకు గుర్తింపు

ఖమ్మం : ఖమ్మం జిల్లా సర్వజన ఆస్పత్రి మాతాశిశు ఆరోగ్య కేంద్రంలోని తల్లిపాల బ్యాంకుకు బీఎఫ్‌హెచ్‌ఐ(బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ హాస్పిటల్ ఇన్సియేటివ్) గ్రేడ్-1 అక్రిడిటేషన్ లభించింది. నేషనల్ అడ్వయిజరీ కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) సూచించిన పది సూత్రాల అమలు తీరును బీఎఫ్‌హెచ్‌ఐ బృందం పరిశీలించింది. ఖమ్మం ఆస్పత్రి తల్లిపాల బ్యాంకు అత్యాధునిక పరికరాలతో అత్యుత్తమ సదుపాయాలు కలిగిన సమగ్ర చనుబాల నిర్వహణ కేంద్రంగా నిలిచింది. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇచ్చేలా గర్భిణులు, బాలింతలను ప్రోత్సహిస్తున్నారు. మాతా శిశు సేవల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించేందుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్రమంలో సంతృప్తి వ్యక్తం చేసిన బీఎఫ్‌హెచ్‌ఐ-నాక్ ఎంసీహెచ్ మిల్క్ బ్యాంకుకు సర్టిఫికెట్ ఆఫ్ అక్రిడిటేషన్ ప్రకటించింది. మూడేళ్ల పాటు ఈ గుర్తింపు కొనసాగుతుందని అందులో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్‌ఎంవో బి.శ్రీనివాసరావు, పిల్లల




వైద్య నిపుణులు పవన్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సుగుణ, చంద్ర భగీరథ, క్వాలిటీ మేనేజర్ ఉపేందర్, సఫియా, లావణ్య హర్షం వ్యక్తం చేశారు.

పరిశీలించిన అంశాలు ఇవే... తల్లిపాల పాలసీలో రాతపూర్వక విధానాన్ని కలిగి ఉండాలి. ఈ విషయాలు ఆరోగ్య సిబ్బందికి తెలియాలి. ఆరోగ్య సిబ్బంది నైపుణ్యం గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యం తెలియజేయడంబిడ్డ పుట్టిన గంటలోపే పాలు పట్టించేందుకు తల్లికి సహకరించడం తల్లీబిడ్డలు విడిగా ఉండాల్సిన పరిస్థితి వచ్చినా తల్లిపాలు ఎలా పట్టించాలనే విషయాన్ని తల్లికి నేర్పించడంవైద్యపరమైన అవసరాలుంటే తప్ప బిడ్డకు తల్లిపాలే తప్పనిసరిగా తాగించడం తల్లీ బిడ్డ రోజుకు 24 గంటలు కలిసి ఉండే సదుపాయంబిడ్డకు అవసరమైన ప్రతిసారి తల్లిపాలు ఇచ్చేలా ప్రోత్సహించడంపిల్లలకు కృత్రిమ నిప్పల్స్‌ను వినియోగించకపోవడంతల్లిపాలు ఇచ్చేలా ప్రోత్సహించేందుకు బృందాన్ని ఏర్పాటు చేసి డిశ్చార్జి చేసే సమయంలో కౌన్సెలింగ్ ఇవ్వడం వంటి అంశాలను పరిశీలించారు.

# చివరి దశకు కూడళ్ల సుందరీకరణ పనులు



వేములవాడ : వేములవాడ ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలో కూడళ్ల సుందరీకరణ పనులు అబ్బుర పరిచేలా చేపట్టాలని నిర్ణయించారు. అయితే పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. గత మహా శివరాత్రి నాటికి పూర్తి చేయాల్సి ఉంది. నెలలు తరబడినా వీటిని పూర్తి చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి రోజూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. వీరితోపాటు ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలను ఆకర్షించే విధంగా శాత్రాజుపల్లి వైపు కూడలి, నందికమాన్ వద్ద కూడలి, మూలవాగు వంతెనకు ఇరువైపులా బండ్ సుందరీకరణ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా వేములవాడ పట్టణ శివారులో నందికమాన్ వద్ద కోటి రూపాయలతో గోపురాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ పనులు చివరి దశకు చేరుకున్నాయి. వాస్తవానికి గత శివరాత్రి నాటికే పూర్తి చేయాల్సి ఉన్నా నేటికీ పూర్తి కాలేదు. కలెక్టర్ అనురాగ్ జయంతి క్షేత్ర స్థాయిలో పర్యటించి అధికారులకు దిశానిర్దేశం చేస్తూ పనుల్లో వేగం పెంచేలా చర్యలు చేపట్టారు. దీంతో ఈ నిర్మాణాలు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటికే శాత్రాజుపల్లి వైపు కూడలి పనులు పూర్తయ్యాయి. మొత్తం పనులన్నీ ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రాత్రి వేళల్లో చూపరులను మరింత ఆకట్టుకునేలా రంగు రంగుల విద్యుత్తు దీపాల వెలుగుల్లో గోపురం, నంది డిజైన్‌తో జిగేల్ మనేలా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. చుట్టూ వివిధ రకాల విగ్రహాలను, త్రిశూలాలను ఏర్పాటు చేశారు. ఇవి ఇతర ప్రాంతాల నుంచి వేములవాడకు వచ్చే రహదారుల కూడళ్లు కావడంతో వచ్చిపోయే భక్తులు, వాహనదారులు, ప్రజలను ఆకట్టుకోనున్నాయి.

తీవ్ర జాప్యంతో...వేములవాడ మూలవాగు వద్ద ఇరువైపులా రూ. 1.98 కోట్లతో నిర్మించే బండ్ సుందరీకరణ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. ఇక్కడ మూలవాగుకు ఇరువైపులా మట్టి బండ్ పూర్తి చేసినప్పటికీ మిగులు పనులు పూర్తి చేయడం లేదు. ఉత్తరం వైపు బండ్ చివరి దశకు చేరుకున్నప్పటికీ, దక్షిణం వైపు నిర్మాణంలోనే మూలుగుతోంది. వంతెన మొదలు నుంచి బస్టాండ్ వెనుక వైపు 210 మీటర్లు, వంతెన చివర నుంచి వైకుంఠధామం వైపు 330 మీటర్ల పొడవు మట్టి బండ్ నాలుగు మీటర్ల వెడల్పుతో పాటు కట్టకు రాతి పేర్పు పనులు పూర్తయ్యాయి. మూలవాగు బండ్ సుందరీకరణ పనులు నీటిపారుదలశాఖ అధికారుల పర్యవేక్షణలో జరిగాయి. బండ్‌పై చేపట్టాల్సిన పనులన్నీ మున్సిపల్ అధికారులు చేయాల్సి ఉంది. ఉత్తరం వైపు బండ్‌పై పనుల్లో కొంత పురోగతి ఉన్నా, దక్షిణం వైపు మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో సకాలంలో పూర్తి కాని దుస్థితి నెలకొంది. బండ్ పొడవునా వాకింగ్ ట్రాక్, బెంచీలు, గ్రాస్, చెట్లు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటిని పూర్తి చేస్తే పట్టణ ప్రజలు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉదయం, సాయంత్రం వేళ మూలవాగు ఒడ్డున సేద తీరడానికి అవకాశం ఉంటుంది.

పూర్తి చేసేందుకు చర్యలు

పట్టణంలోని శాత్రాజుపల్లి వైపు కూడలి, నంది కమాన్ వద్ద కూడలి సుందరీకరణ పనులు పూర్తయ్యాయి. మూలవాగు బండ్ సుందరీకరణ పనులు పూర్తి కావాల్సి ఉంది. బండ్ నిర్మాణం పూర్తి చేసి మాకు అప్పగిస్తే దానిపై గ్రీనరీ, బల్లలు, మొక్కలు నాటడం, విద్యుత్తు దీపాల ఏర్పాటు వంటి పనులు చేయాల్సి ఉంది. బస్టాండ్ వైపు బండ్ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. అది పూర్తి కాగానే మిగతా సుందరీకరణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.అన్వేష్, కమిషనర్, వేములవాడ మున్సిపల్

# రెండో దశ సోలార్ ప్లాంట్లకు టెండర్లు



వేములవాడ : గోదావరిఖని సింగరేణి సంస్థ రెండో దశలో నిర్మించనున్న సోలార్ విద్యుత్తు కేంద్రాలకు త్వరలోనే టెండర్లు ఆహ్వానించనుంది. దీని కోసం డీపీఆర్ నివేదికలు పూర్తి చేసింది. ఇందులో సవివరంగా చర్చించి మార్పులు చేర్పులుంటే వాటిని సవరించి టెండర్లు ఆహ్వానించే దిశగా చర్యలు చేపట్టింది. 240 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను 13 ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు డీపీఆర్ నివేదికల్లో రూపొందించారు. మరింత లోతుగా అధ్యయనం చేసి వారం రోజుల్లో సమగ్ర నివేదికను రూపొందించి వచ్చే బోర్డు సమావేశంలో ఆమోదించి వెంటనే టెండరు ప్రక్రియను ప్రారంభించేందుకు సీఎండీ శ్రీధర్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మొదటి దశలో చేపట్టిన 300 మెగావాట్ల సోలార్ విద్యుత్తు కేంద్రాల్లో 224 మెగావాట్ల ప్లాంట్లు పూర్తి చేశారు. ఇంకా 76 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు నిర్మాణ దశలో ఉన్నాయి. తాజాగా రెండో దశలో సోలార్ విద్యుత్తు కేంద్రాలను నెలకొల్పేందుకు డీపీఆర్ నివేదికలు సిద్ధం చేసింది. బోర్డు ఆమోదం తీసుకొని టెండరు ప్రక్రియను మొదలు పెట్టేందుకు సిద్ధమైంది. మొదటి, రెండో దశలో చేపట్టే సోలార్ ప్లాంట్ల నిర్మాణం పూర్తయితే సంస్థ ఏటా విద్యుత్తు వినియోగానికి వెచ్చించే ఆదాయం మిగలనుంది. విద్యుత్తుకు ఏటా రూ.600 కోట్లు సింగరేణి సంస్థ విద్యుత్తు వినియోగానికి ఏటా రూ.600 కోట్లు వెచ్చిస్తుంది. బొగ్గు ఉత్పత్తికి వినియోగించే భారీ యంత్రాలు, కార్మికుల గృహ అవసరాలతో పాటు వీధుల్లో వినియోగించే విద్యుత్తు ఏటా 750 మిలియన్ యూనిట్లు ఖర్చవుతుంది. ప్రస్తుతం సంస్థ మొదటి దశలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ల ద్వారా ప్రస్తుతం 240 మెగావాట్లు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా రూ.300 కోట్ల వరకు ఆదా చేయగలిగింది. మొదటి దశలో మిగిలిపోయిన 76 మెగావాట్లు, రెండో దశలో మొదలు పెట్టనున్న 240 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు అందుబాటులోకి వస్తే మొత్తం 810 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తవుతుంది. సింగరేణికి కావాల్సిన 750 మిలియన్ యూనిట్ల కంటే ఎక్కువగా ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంది. దీంతో రానున్న రెండేళ్లలో ఎలాంటి ఖర్చు లేకుండా సంస్థ విద్యుత్తునే వినియోగించుకునే అవకాశం ఉంది. సింగరేణి విద్యుత్తు వినియోగానికి వెచ్చించే రూ.600 కోట్లు ఆదా అయ్యే అవకాశాలున్నాయి.

# అసలే ఇరుకు.. ఆపై ఆక్రమణలు

యాదగిరిగుట్ట : యాదాద్రి అభివృద్ధిలో భాగంగా హైదరాబాద్-యాదగిరిగుట్ట రహదారిని విస్తరణ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇరువైపులా 60 అడుగుల విస్తరణ ప్రతిపాదనలు చేసి మొదటి విడతగా ఇరువైపులా 30 అడుగుల వెడల్పుతో విస్తరణ చేపట్టి పూర్తి చేసింది. 60 అడుగుల విస్తరణకు మార్కింగ్ చేసి, సర్వే చేసి అన్ని సిద్ధం చేసిన సమయంలోనే కరోన కాలంతో ప్రతిపాదన మూలకు పడింది. దీంతో పట్టణంలో రోడ్డు విస్తరణ లేక, రోడ్డు సరిపోలేక లారీలు, బస్సులు, పెద్ద వాహనాలు మళ్లడం అతికష్టంగా మారుతోంది. ఇదే అదనుగా భూ ఆక్రమణదారులు రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకొని దుకాణాలు ఏర్పాటు చేసుకుంటూ, చిరువ్యాపారుల ఏర్పాటుతో రోడ్డును మరింత ఇరుకుగా మారుస్తున్నారు. దీనిపై అటు రోడ్డు, భవనాల శాఖ అధికారులు, ఇటు పురపాలిక అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పట్టనట్టుగా ఉన్నారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణలు చేపడితే ఆందోళనలు, నష్ట పరిహారాలకు డిమాండ్లు కలిగే అవకాశం లేకపోలేదని ప్రజలు సూచిస్తున్నారు. దీనిపై పురపాలిక అధికారుల దృష్టికి తీసుకుపోగా చర్యలు తీసుకుంటామన్నారు.

గొంగిడి సునీత ఎన్నికపై అభ్యంతరాలుంటే పిటిషన్ వేయొచ్చు

గెజిట్ జారీ చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశంఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత ఎన్నికను సవాల్ చేసిన అభ్యర్థి ఎస్.సతీష్‌కుమార్ చనిపోయినందున.. ఈ ఎన్నికపై అభ్యంతరాలు ఉన్నవారు పిటిషన్ దాఖలు చేయవచ్చని.. దీనిపై గెజిట్ జారీ చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. సతీష్‌కుమార్ దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్‌పై జస్టిస్ ఎం.లక్ష్మణ్ ఇటీవల విచారణ జరిపారు. ఈ కేసు విచారణలో ఉండగా పిటిషనర్ సతీష్‌కుమార్ మరణించినందున ఎమ్మెల్యేగా సునీత ఎన్నికపై ప్రజలకు అభ్యంతరాలుంటే ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు ఆస్కారం ఉందని స్పష్టం చేశారు. పిటిషనర్ మరణించినట్లుగా ప్రభుత్వం గెజిట్ ప్రచురణ ద్వారా ప్రజలకు తెలియజేసి, ఆలేరు ఎన్నికను ఎవరైనా సవాల్ చేయదలిస్తే గెజిట్ ప్రచురణ జరిగిన 14 రోజుల్లోగా హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చంటూ ప్రజలకు తెలియజేయాలని ఉత్తర్వులు జారీ చేశారు

# రాయితీ భారం.. భానుడు దూరం

యాదగిరిగుట్ట : ఉమ్మడి జిల్లాలో సౌర విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రభుత్వం రాయితీల్లో కోత పెట్టడం, పైగా యూనిట్ విలువనూ పెంచడం ఔత్సాహికులను నిరుత్సాహానికి గురి చేస్తోంది. విద్యుత్తు ఆదా కోసం సౌర పలకలు ఏర్పాటు చేసుకోవాలనే వారికి ప్రభుత్వం నిర్ణయం ఇబ్బందిగా మారింది. ఉమ్మడి జిల్లాలో సౌర విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుకు



గతేడాది 292 మంది ముందుకొచ్చారు. యాదాద్రిలో 37, నల్గొండలో 90, సూర్యాపేటలో 165 మంది సౌర యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. అత్యధికంగా సూర్యాపేట జిల్లాలోనే ఎక్కువ మంది ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో మరింత మందిని ప్రోత్సహించేందుకు యూనిట్ విలువ తగ్గించి రాయితీ పెంచాల్సి ఉన్నా.. ప్రభుత్వం మాత్రం భిన్నంగా సోలారు విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుకు ముందుకు రావడం లేదు.రాయితీ ఇలా సౌర విద్యుత్తు యూనిట్లను ఇళ్లపై ఏర్పాటుకు చేసుకొనేందుకు ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. గతేడాది ఒక కిలోవాట్ సోలార్ విద్యుత్తు యూనిట్ విలువ రూ.53,300గా ఉండేది. రాయితీ కింద రూ.21,320 వచ్చేది. ఇప్పుడు యూనిట్ విలువ రూ.83,700కు పెంచి రాయితీని రూ.14,588కు కుదించారు. ఈ యూనిట్ నుంచి రోజుకు 4 యూనిట్ల చొప్పున నెలకు 120 యూనిట్లు విద్యుదుత్పత్తి చేయొచ్చు.

రెండు కిలో వాట్ సామర్థ్యం గల యూనిట్ విలువ గతంలో రూ.98వేలు ఉండగా.. ఇప్పుడు రూ.1.44 లక్షలకు చేరింది. గతంలో రాయితీ రూ.39వేలు ఉండగా ప్రస్తుతం రూ.29,176 అందనుంది. రోజుకు 8 యూనిట్ల చొప్పున ఏడాదికి 2,920 యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయొచ్చు. మూడు కిలోవాట్ సామర్థ్యం యూనిట్‌కు గతేడాది రూ.1.43 లక్షలు ఖర్చయ్యేది. ఇప్పుడు రూ.2.06 లక్షలు అవుతోంది. గతంలో రూ.57వేలు ఉన్న రాయితీ ఇప్పుడు రూ.43,764కు కుదించారు. ఈ యూనిట్‌లో రోజుకు 12 యూనిట్ల చొప్పున సంవత్సరానికి 4,380 యూనిట్ల విద్యుదుత్పత్తి చేయొచ్చని అధికారులు చెబుతున్నారు.

రాయితీ విషయం ప్రభుత్వ పరిధిలో ఉంది

శ్రీనివాస్, డిస్కం డీఈ, సూర్యాపేట

సోలారు విద్యుత్తు యూనిట్ విలువ పెంపు, రాయితీ తగ్గింపు అంశాలు ప్రభుత్వం పరిధిలో ఉన్నాయి. గృహ అవసరాల యూనిట్ల ఏర్పాటుపై ఆసక్తి ఉంటే ఏర్పాటుకు కృషి చేస్తాం.

# కస్తూర్బా విద్యాలయాలకు మంచిరోజులు

నిజామాబాద్ : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలంటే గతంలో సమస్యలకు నిలయాలుగా పేరుండేది. నూతన భవనాలు అందుబాటులోకి రావడం, బోధన, బోధనేతర సిబ్బంది బదిలీలు చేపట్టడం, తాజాగా ప్రభుత్వం విద్యార్థులకు అందించే భోజన ఖర్చుల మొత్తం పెంచడంతో పాటు సౌకర్యాల కల్పనకు ఉపక్రమించడంతో ఈ విద్యాసంస్థలకు మంచిరోజులొచ్చాయి.

ఇదీ పరిస్థితి

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 25 కస్తూర్బా బాలికల విద్యాలయాలు ఉన్నాయి. అందులోని తొమ్మిదింటిలో ఆరు నుంచి ఇంటర్ ద్వితీయ



సంవత్సరం వరకు, 16 చోట్ల ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యాబోధన కొనసాగుతోంది. వీటిల్లో సుమారు 5,806 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ఎడపల్లి కేజీబీవీలో కేవలం మైనార్టీలకు అవకాశం కల్పించారు.

నియామకాలకు అవకాశం

జిల్లాలో 253 మంది బోధన సిబ్బంది, 311 మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తుండగా.. మొత్తం 58 ఖాళీలున్నాయి. బదిలీల అనంతరం వాటిని భర్తీ చేసే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

సిబ్బంది అనాసక్తి

చాలారోజుల తర్వాత ప్రభుత్వం బదిలీలకు అవకాశం కల్పించినప్పటికీ సిబ్బంది అనాసక్తి చూపుతున్నారు. బదిలీ కోరుతూ ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు రెండంకెలకు చేరుకోలేవని తెలిసింది.

ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్

సౌకర్యాలు మెరుగుపర్చడంతో వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సర్కారు ఆదేశించింది. ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. పేదలు, తల్లిదండ్రుల్లో ఒకరు లేనివారు, అనాథలకు అధిక ప్రాధాన్యం కల్పించనున్నారు. బోధన్, భీమ్‌గల్, డిచ్‌పల్లి, మాక్లూర్, ఆర్మూర్ కేజీబీవీలోని ఇంటర్మీడియట్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు, బాల్కొండ, జక్రాన్‌పల్లి, నందిపేట్, నిజామాబాద్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి.

మరింత నాణ్యమైన భోజనం

తరగతుల నిర్వహణ, రాత్రి వసతి అక్కడే ఉండటంతో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రిపూట భోజనాలు కల్పిస్తున్నారు. అందుకు ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం నెలకు రూ.1,049 వెచ్చిస్తోంది. ఖర్చులు పెరిగిన దృష్ట్యా తాజాగా సదరు మొత్తాన్ని రూ.1,225 కు పెంచింది.

పీఎంశ్రీకి రెండు ఎంపిక

వనిత, సెక్టోరియల్ అధికారిణి, నిజామాబాద్

ప్రభుత్వం పెంచిన మెస్‌ఛార్జీలతో విద్యార్థినులకు మరింత నాణ్యమైన భోజనం అందనుంది. అన్ని పాఠశాలల్లో మంచి వసతులతో పాటు ఆంగ్లమాధ్యమంలో విద్యనందించేందుకు కృషి చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న పీఎంశ్రీ పథకానికి రెండు కేజీబీవీలు ఎంపిక కావడం ప్రస్తుత పనితీరుకు నిదర్శనం.నూతనంగా నిర్మించిన ఇందల్‌వాయి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల భవనం

# టీఆర్ఎస్‌లో ఆధిపత్య పోరు!

ఆదిలాబాద్ : రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టిన కారు గుర్తు పార్టీ జిల్లాలో కంట్రోల్ తప్పుతుందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. గత కొంత కాలం వరకు జిల్లా పార్టీకి రథసారథి లేకపోవడంతో ఎవరికి వారే యమునా తీరు అన్నట్లుగా కనిపించింది. దీనిపై ప్రత్యేక దృష్టిని సారించిన పార్టీ అధిష్ఠానం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పార్టీ అధ్యక్షులను నియమించి పార్టీ పగ్గాలను అప్పగించిం ది. దీంతో అంతా సైలెంట్‌ైపోతుందని భావించినా.. నేతల మధ్య ఆధిపత్య పోరు తగ్గినట్లు కనిపించడం లేదు. తాజాగా జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నకు ఎలాంటి సమాచారం లేకుండానే బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తన నియోజకవర్గ అధికార ప్రతినిధిగా మొట్టె కిరణ్‌ను నియమిస్తున్నట్లుగా ప్రకటించడం కొత్త వివాదానికి దారి తీసింది. పార్టీ పదవులన్నీ జిల్లా పార్టీ అధ్యక్షుడి ఆదేశాల మేరకే చేపట్టాల్సి ఉండగా.. బోథ్ నియోజకవర్గంలో మాత్రం ఎమ్మెల్యేనే పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించడంపై అధికార పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బోథ్ నియోజకవర్గంలో నాలుగైదు గ్రూపులుగా విడిపోయిన పార్టీ నేతలు.. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పని చేస్తూ అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. పార్టీ ఆదేశాలను పక్కన పెట్టి మరీ సొంత నిర్ణయాలతో పార్టీ పదవులను కేటాయించడం పట్ల పలువురు స్థానిక నేతలు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తీరుపై అధి ష్ఠానం పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు మూకుమ్మడిగా సిద్ధమవుతున్నా రు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ చూసినా అధికార పార్టీలో జరుగుతున్న పరిణామాలపై చర్చించుకోవడమే హాట్ టాపిక్‌గా కనిపిస్తోంది. అంతా ఆగమాగంప్రస్తుతం పార్టీలో ఎలాంటి పదవుల కేటాయింపులు లేకపోయినా.. బోథ్ నియోజకవర్గంలో మాత్రం ఆగమేఘాల మీద ఎమ్మెల్యే పార్టీ పదవులను కేటాయించడాన్ని సొంత పార్టీ నేతలే తప్పుబడుతున్నారు. తన వ్యతిరేక వర్గానికి చెక్ పెట్టడానికే ఎమ్మెల్యే ఆదరబాదరగా అధికార ప్రతినిధి నియామకం చేపట్టారన్న విమర్శలు లేకపోలేదు. జిల్లా పార్టీ అధ్యక్షుడు రామన్నకు కొంత సన్నిహితంగా ఉండే బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్‌కు అవకాశం దక్కుతుందన్న అనుమానంతోనే దళిత సామాజిక వర్గానికి చెందిన నేతను తెరపైకి తెచ్చినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. పార్టీలో ఏ పదవైనా రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడి ఆదేశాల మేరకే జిల్లా పార్టీ అధ్యక్షుడు నియామక ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. కాని బోథ్‌లో మాత్రం దానికి విరుద్ధంగా నియామకం చేపట్టడం పై దుమారం రేపుతోంది. వ్యతిరేకవర్గం నుంచి ఇబ్బందులు ఉండకుండా ముందుచూపుతోనే నియోజకవర్గానికి చెందిన పార్టీ పదవుల నియామ కాలను చేపట్టినట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యేపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. బెడిసి కొట్టిన వ్యూహంతన అనుచర వర్గానికి పార్టీ పదవులను కట్టబెట్టి మరింత దగ్గరయ్యే ప్రయత్నాలు చేసిన ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు వ్యూహం బెడిసి కొట్టిందనే వాదనలు వినిపిస్తున్నాయి. గత రెండు, మూడు మాసాల క్రితమే బోథ్ ఎంపీడీవోగా పని చేసిన రాథోడ్ రాధాను తొలగించాలని పట్టుబట్టిన ఎమ్మెల్యే, ఎట్టకేలకు తన పంతం నెగ్గించుకున్నారు. జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని సైతం బహిష్కరించి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ ఎమ్మెల్యే అయి ఉండి జడ్పీ సమావేశాన్ని బహిష్కరించడం ఏమిటన్న ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమయ్యాయి. అవినీతికి పాల్పడిన ఎంపీడీవో రాథోడ్ రాధాను తన నియోజకవర్గం నుంచి పంపించేయాలని పట్టుబట్టడంతో కలెక్టర్ తప్పనిసరి పరిస్థితుల్లో సస్పెండ్ చేయాల్సి వచ్చింది. అయితే మూడు మాసాలు గడవక ముందే మళ్లీ బోథ్ నియోజకవర్గంలోని బజార్‌హత్నూర్ మండల ఎంపీడీవోగా రాథోడ్ రాధా ఉద్యోగ బాధ్యతలు చేపట్టడం ఎమ్మెల్యే వర్గాన్ని ఆగ్రహానికి గురి చేసింది. ఇటీవల జరిగిన కొన్ని రాజకీయ పరిణామాలు ఇబ్బందికరంగా మారాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. తాజాగా పార్టీ ఆదేశాలు లేకపోయినా.. అధికార ప్రతినిధి నియామకం చేపట్టడం సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు తప్పుబడుతున్నారు. అనుకున్నదొక్కటి.. అయినది మరొకటి కావడంతో ఎమ్మెల్యే వ్యూహం బెడిసి కొట్టినట్లయ్యిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆ నియామకంతో పార్టీకి సంబంధం లేదు: జోగు రామన్న, టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్‌బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి నియామకంతో టీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదు. రాష్ట్ర పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే జిల్లా పార్టీ అధ్యక్షుడు నియామక ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. నేరుగా పార్టీ పదవులను కేటాయించే అధికారం జిల్లా పార్టీ అధ్యక్షుడికే లేదు. ఎమ్మెల్యే ఇష్టారాజ్యంగా పార్టీ పదవులను కేటాయించడం సరైంది కాదు. ఈ విషయమై ఇప్పటికే చర్చించడం జరిగింది. అధికార ప్రతినిధి నియామకం చెల్లదని వెల్లడించడం జరిగింది. ఏది ఏమైనా పార్టీ ఆదేశాల ప్రకారమే నడుచుకోవాల్సి ఉంటుంది.

# 6.64 టన్నుల గంజాయి బూడిద



కొత్తగూడెం : ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని మన్యం ప్రాంతం నుంచి తరలించే గంజాయిని భద్రాద్రి జిల్లా పోలీసులు ఇటీవల స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లలో పేరుకుపోయిన 6.64 టన్నుల సరకును జిల్లా డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్పీ సునీల్‌దత్ పర్యవేక్షణలో దహనం చేశారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమీపంలోని అటవీ ప్రాంతంలో శాస్త్రీయ పద్ధతిలో కాల్చి బూడిద చేశారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కేఆర్‌కే ప్రసాదరావు, ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ ఉపేందర్, అడ్మిన్ ఆర్ఐ దామోదర్ పాల్గొన్నారు.

# రాజధానికి ఒక్క రైలే దిక్కు..



మంచిర్యాల : కుమురంభీం, మంచిర్యాల జిల్లా వాసులకు హైదరాబాద్ వెళ్లేందుకు రైళ్లు లేక ఇబ్బందిపడుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ – సిర్పూర్ కాగజ్‌నగర్‌ల మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఒక్కటే దిక్కయింది. జమ్మికుంట– ఉప్పల్ రైల్వేస్టేషన్ల మధ్య మూడోలైను పనుల కారణంగా జూన్ 27 నుంచి జులై 20 వరకు ముఖ్యమైన రైళ్లను రద్దు చేయడమే కాకుండా 12 రైళ్లను దారి మళ్లించారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కావడంతో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డుమార్గమే శరణ్యం..

సిర్పూర్ కాగజ్‌నగర్– సికింద్రాబాద్‌ల మధ్య నడిచే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, కాజీపేట – సిర్పూర్‌టౌన్‌ల మధ్య నడిచే రామగిరి ప్యాసింజరు రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. భద్రాచలంరోడ్ – బల్లార్షాల మధ్య నడిచే సింగరేణి ప్యాసింజరు భద్రాచలం రోడ్ నుంచి వరంగల్ వరకు, సికింద్రాబాద్ – బల్లార్షాల మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ కాజిపేట వరకు మాత్రమే నడుస్తుంది. దీంతో జిల్లా ప్రజలకు రెండు రైళ్లు అందుబాటులోకి రావడం లేదు. జిల్లా వాసులకు సికింద్రాబాద్, వరంగల్ ప్రాంతాలకు వెళ్లాలంటే రైలు మార్గమే సులువుగా ఉంటుంది. రోడ్డుమార్గంలో వెళ్లాలంటే కరీంనగర్ మీదుగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇలా చాలా దూరంతో పాటు అధిక సమయం, ఆర్థిక భారం పడుతుంది. దీంతో ఎక్కువగా ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు రైళ్లనే ఆశ్రయిస్తారు. మూడోలైను పనుల కారణంగా కేవలం ఇంటర్‌సిటీ (మంచిర్యాలలో మధ్యాహ్నం 12.49 గంటలకు) ఒక్కటే ఇప్పుడు అందుబాటులో ఉంది. దిల్లీ – హైదరాబాద్ మధ్య నడిచే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కూడా ఉంది. కానీ.. ఇందులో కేవలం నాలుగు జనరల్ బోగీలు మాత్రమే ఉంటాయి. మిగతావన్నీ రిజర్వేషన్‌తో ఉంటాయి. సాధారణంగానే తెలంగాణ రైలులో జనరల్ బోగీలు కిక్కిరిసి ఉంటాయి. అందుకే ఇందులో ప్రయాణం కొంత ఇబ్బందికరంగానే ఉంటుంది. ఇది కేవలం మంచిర్యాల, సిర్పూర్‌కాగజ్‌నగర్‌లోనే ఆగుతుంది. మిగతా రైల్వేస్టేషన్లకు వెళ్లే ప్రయాణికులు లేదా అక్కడి నుంచి వచ్చే ప్రయాణికులు ఇంటర్‌సిటీని మాత్రమే ఆశ్రయించాల్సి ఉంది.

భాగ్యనగర్ నడపవచ్చు...24 రోజుల పాటు ముఖ్యమైన రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోనున్నారు. ముఖ్యంగా మంచిర్యాల నుంచి ఉదయం 5 గంటలకు సికింద్రాబాద్ వెళ్లేందుకు అనువైన రైలు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్. ఈ రైలులో సికింద్రాబాద్‌కు ఉదయం 11 గంటలలోపు చేరుకొని తిరిగి మధ్యాహ్నం 3.30 గంటలకు రైలు బయలుదేరి రాత్రి 8.30గలకు మంచిర్యాలకు వస్తుంది. ఈ రైలులో ఎక్కువగా విద్యార్థులు, వ్యాపారులు, ఆసుపత్రులు ఇతరత్రా కారణాలకు వేలాది మంది ప్రయాణిస్తుంటారు. కాబట్టి కాషన్ ఆర్డర్ మ్యానువల్‌గా భాగ్యనగర్ వంటి డిమాండ్ ఉన్న రైలును నడపవచ్చని రైల్వే నిపుణులు సూచిస్తున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు వెంకటేష్‌నేతతో పాటు జిల్లా శాసనసభ్యులు రైల్వే అధికారులపై ఒత్తిడి తీసుకువస్తే సమస్యకు పరిష్కారం దొరికే వీలు లేకపోలేదు.

అందుబాటులో ఆర్టీసీ బస్సులు..

భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు రద్దు కావడంతో ప్రయాణికుల సౌకర్యార్థం మంచిర్యాల ఆర్టీసీ డిపో అధికారులు ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు మూడు నుంచి ఐదు బస్సులను అదనంగా నడిపిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్‌కు రూ.360, డీలక్స్‌కు రూ.410, సూపర్‌లగ్జరీకి రూ.460, రాజధానికి రూ.600 టికెట్టు ధరలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# యువ హస్తం.. వైద్య నేస్తం



మంచిర్యాల : వైద్యుడు.. కనిపించే దేవుడు. తెల్లకోటు చాటున ఎల్లలు లేని ప్రేమను చూపించి కరోనా కాలంలో ప్రాణ త్యాగాలు చేశారు. కొంతమంది మారుమూల గ్రామాల్లో పనిచేస్తూ సర్కారు సేవలోనే పూర్తి సమయాన్ని గడుపుతూ మెప్పుపొందుతున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా యువవైద్యులే ఎక్కువగా ఉన్నారు. అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వరంగంలో సేవలందిస్తున్న యువవైద్యులపై కథనం.

ప్రశాంతంగా ఉంటూ..పని చేసుకుంటూ

క్యాతనపల్లి మండలానికి చెందిన డా.రమేష్ ప్రస్తుతం పాతమంచిర్యాల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. పన్నెండేళ్లుగా మంచిర్యాల ప్రజలకు ఆరోగ్యసేవలందిస్తున్నారు. ఎంబీబీఎస్ అనంతరం 2004లో తాత్కలిక పద్ధతిలో చేరారు. ఆర్టీసీ కార్మికులకు సైతం ఆరేళ్లపాటు తన సేవలందించి ఉద్యోగుల మెప్పుపొందారు. కాలనీల్లో పర్యటించినా ఎప్పుడు ప్రశాంతంగా కనిపిస్తూ ఓపికగా సమాధానమిస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. కరోనా వేళ సమయానికి మించి కేంద్రంలో ఉంటూ బాధితులకు సేవలందించారు.

రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు

మారుమూల గాదిగూడ పీహెచ్‌సీ వైద్యాధికారి జి.పవన్‌కుమార్ ఆదివాసీ గర్భిణులు ఎక్కువ మంది రక్తహీనతకు గురవుతుండటం గమనించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ నివారణకు కృషి చేస్తున్నారు. ప్రజారోగ్య సిబ్బంది ద్వారా గర్భిణులకు అవగాహన కల్పిస్తూ అవసరమైన వారికి ఐరన్ సుక్రోజు ఇంజక్షన్‌లు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పీహెచ్‌సీ ఆదిలాబాద్ రిమ్స్‌కు దాదాపు 55 కి.మీ.దూరంలో ఉండటంతో అక్కడి గ్రామాల వారికి సరైన రహదారి సౌకర్యం లేక ఇక్కడి వరకు రాలేకపోతారు. దీంతో ఆయన ప్రత్యేకంగా ఆదివాసీ గ్రామాల్లోనే శిబిరాలు ఏర్పాటు చేసి పిల్లలు, గర్భిణులకు వ్యాక్సిన్‌లు అందిస్తున్నారు. ఇళ్ల వద్దనే ప్రసవాలు ఎక్కువగా ఇటీవలి వరకు జరిగేవి. వీటిని ఆయన పూర్తిగా కట్టడి చేయగలిగారు.

ఆర్థో వైద్యుల కొరత తీరుస్తూ..కీళ్లు, ఎముకల శస్త్రచికిత్సల్లో అందెవేసిన చేయిగా అనతికాలంలోనే గుర్తింపు పొందారు మంచిర్యాలకు చెందిన డా.ప్రవీణ్‌కుమార్. ప్రస్తుతం జిల్లా ఆసుపత్రిలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సేవలందిస్తున్నా తన(టీవీవీపీకి చెందిన) సహకారం సైతం ఇస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. మొదట తాత్కలిక (ఎంబీబీఎస్) వైద్యుడి హోదాలో చేరి, సంబంధం లేకున్నా ఆసుపత్రిలో ఆర్థో వైద్యుల కొరత, రోగులు పడుతున్న ఇబ్బందిని గుర్తించి మానవత్వాన్ని చాటారు. ఆయా సేవలందించడంతో పాటు అరుదైన శస్త్రచికిత్సలుచేసి బాధితులతో పాటు ఇతర వైద్యుల ప్రశంసలు పొందారు. అనంతరం ఆయన స్థానంలో శాశ్వత వైద్యుడు చేరడంతో రాజీనామా చేసి ఇటీవల మరోసారి అవకాశం రావడంతో తిరిగి విధుల్లో చేరి గత తీరును కనబరుస్తున్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాలు

గ్రామీణ నేపథ్యమున్న ముత్యాల సురేష్ బజార్‌హత్నూర్ ఏజన్సీ పీహెచ్‌సీలో 2019 నుంచి వైద్యాధికారిగా కొనసాగుతున్నారు. రహదారులు లేని గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఆదివాసీలకు సేవలందిస్తున్నారు. ప్రధానంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు కరోనా కారణంగా నిలిచిపోయినప్పటికి ఆ పీహెచ్‌సీలో వీటిని కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు 150 వరకు కుని శస్త్ర చికిత్సలు చేశారు. అంతేగాక పీహెచ్‌సీ వరకు రాలేని గర్భిణుల వివరాలను తెలుసుకొని వారి గ్రామాలకే వెళ్లి అవసరమైన వైద్యసాయం అందిస్తుంటారు.

మారుమూల ప్రాంతాల్లో.. ప్రజా సేవలో

బెల్లంపల్లికి చెందిన డా.ఝాన్సీరాణి తన నియోజకవర్గ ప్రజలకు వైద్యసేవలందించడంలో నిమగ్నమవుతోంది. ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న వెంటనే తాత్కలిక వైద్యురాలిగా నెన్నెల పీహెచ్‌సీలో 2014లో చేరి అతి తక్కువ సమయంలోనే అక్కడి ప్రజల మెప్పు పొందారు. 2018లో శాశ్వత వైద్యురాలిగా గుర్తింపు లభించింది. ఆ తర్వాత మారుమూల ప్రాంతాలు కాసిపేట, తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోనూ విధులు నిర్వర్తించారు. ముఖ్యంగా కరోనా సమయంలో బాధితులకు మెరుగైన సేవలందించారు. ప్రస్తుతం నెన్నెల వైద్యాధికారితో పాటు బెల్లంపల్లిలోని షంషీర్‌నగర్ యూపీహెచ్‌సీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# పనులు నత్తనడక

ఖమ్మం : నగరంలోని ప్రధాన రహదారుల్లో బోనకల్లు క్రాస్‌రోడ్డు–ముస్తఫానగర్ ఒకటి. నగర శివారు ప్రాంతానికి, బోనకల్లు వైపు వెళ్లే వేలాది వాహనాలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుత అవసరాలకు తగినట్లు సరిపోవడంలేదని ఈ రహదారి విస్తరణ పనులు చేపట్టారు. కానీ నెలల తరబడి కొనసాగుతుండటంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాత రహదారికి ఇరువైపులా తవ్వి చదును చేసే పనులు చేపట్టారు. ఈ క్రమంలో తాగునీటి పైపులైన్లు దెబ్బతిన్నాయి. వీటి స్థానంలో కొత్తవి వేయడం, దెబ్బతిన్న ప్రాంతంలో సరిచేయడం వంటి పనులు పూర్తి చేయలేదు. దీంతో ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాలు, ఇళ్లలోకి వెళ్లడానికి స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే అంతర్గత రహదారులకు లింకు లోపలిప్రాంతంలో నివసించేవారు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అంచులు సక్రమంగా లేక ప్రధాన రహదారిపై వెళ్లేవారు సైతం ప్రమాదాలబారిన పడుతున్నారు. తక్షణమే పనులు పూర్తి చేయాలని అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సబ్సిడీ గొర్రెలకు మోక్షమెప్పుడో..?

పెద్దపల్లి)రెండవ విడత సబ్సిడీ గొర్రెల పంపిణీ ప్రకటనలకే పరిమితం అవుతోంది. మూడేళ్లుగా ఇప్పుడు, అప్పుడు అంటూ ప్రభుత్వం ఊరిస్తూ వస్తున్నది. ఇటీవల ఎన్‌సీడీసీ ప్రభుత్వానికి రుణం మంజూరు చేయడంతో ఈసారైనా గొర్రెలు పంపిణీ చేస్తారా, చేయరా..? అనే విషయమై జిల్లాలో చర్చ జరుగుతోంది. గొల్ల, కుర్మలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 2017లో సబ్సిడీ గొర్రెల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద ఇచ్చే ఒక్కో యూనిట్ వ్యయం లక్షా 25 వేల రూపాయలుగా నిర్ణయించారు. ఇందులో 75 శాతం సబ్సిడీ కింద ప్రభుత్వం 93,250 రూపాయలు, లబ్ధిదారుడి వాటా 25 శాతం 31,250 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రాథమిక గొర్రెలకాపరులు సహకార సంఘంలో 18 సంవత్సరాలు నిండి సభ్యత్వం ఉన్న వారందరినీ అర్హులుగా పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా 21,254 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరందరికీ రెండు విడతల్లో గొర్రెలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆయా గ్రామాల్లో ఎంపికైన లబ్ధిదారుల పేర్లను డ్రా ద్వారా సగం మందిని మొదటి సంవత్సరానికి ఎంపిక చేశారు. మిగతా వారికి తర్వాత ఏడాది ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మొదటి విడతలో 10,642 మంది లబ్ధిదారులకు 2018 వరకు గొర్రెలను పంపిణీ చేశారు. అదే ఏడాది జూన్ మాసం నుంచే రెండవ విడతలో మిగిలిన 10,612 మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేయాల్సి ఉండగా ప్రభుత్వం ఇవ్వలేదు. 2018 సెప్టెంబర్‌లో ప్రభుత్వానికి రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లడంతో వాయిదా పడ్డాయి. రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పది మాసాల వరకు వరుసగా పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలు జరగడంతో కోడ్ వల్ల గొర్రెల పంపిణీ చేయలేక పోయింది. ఆ తర్వాత పంపిణీ చేస్తుందని గొల్ల, కుర్మలు ఆశించారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయలేదు. బడ్జెట్ లేదంటూ వాయిదా..మూడున్నరేళ్లుగా బడ్జెట్ లేదనే కారణంగా ఇప్పుడు, అప్పుడు అంటూ వాయిదా వేస్తూ వస్తున్నది. రాష్ట్ర పశు సంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రెండవ విడత గొర్రెల పంపిణీ విషయమై అసెంబ్లీ వేదికగా, బహిరంగంగా ఇప్పుడు, అప్పుడు అంటూ పలుసార్లు ఆశలు రేకెత్తించారు. బడ్జెట్‌లోనూ బడ్జెట్ పెట్టామంటూ చెబుతూవచ్చారు. కానీ ఇప్పటివరకు గొర్రెల పంపిణీ జరగలేదు. దీంతో గొల్ల, కుర్మలు సబ్సిడీ గొర్రెలపై ఆశలు వదులుకుంటున్నారు. ప్రభుత్వం ఒక ప్రణాళిక అంటూ లేకుండా ముందుకు సాగడం వల్లనే రెండవ విడత గొర్రెల రావడం లేదనే విమర్శలున్నాయి. ఓట్ల కోసం అర్హులైన వారందరికీ గొర్రెలను ఇస్తామని చెప్పి సగం మందికి ఇచ్చి మళ్లీ గద్దెనెక్కిన తర్వాత ప్రభుత్వం చేతులు దులుపుకున్నదని అంటున్నారు. ఇటీవల ప్రభుత్వానికి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) ద్వారా రుణం మంజూరు చేయడంతో గొల్లకుర్మల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లబ్ధిదారులను ఎంపిక చేసి గొర్రెలను పంపిణీ చేయాలని ప్రతిపక్ష పార్టీలు, ప్రాథమిక గొర్రెల సహకార సంఘాల ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# శాపంగా మారిన సింగరేణి భూ సేకరణ

రామగిరి : ఒకప్పుడు పలు గ్రామాలకు ఆదర్శంగా నిలిచి రాష్ట్రపతి చేతుల మీదుగా నిర్మల్ గ్రామ పురస్కార్ అవార్డు అందుకున్న గ్రామం.. చుట్టూ పచ్చని పంట పొలాలు, ఎటు చూసినా ప్రకృతి అందాలు పాడిపంటలతో అలరారిన బుధవారంపేట్ నేడు అభివృద్ధికి ఆమడదూరంగా నిలిచింది. సింగరేణి యాజమాన్యం గనుల విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణ ఆదర్శ గ్రామానికి శాపంగా మారింది. సింగరేణి సంస్థ ఆర్జీ–3 డివిజన్ పరి?ధిలోని ఓసీపీ–2 ప్రాజెక్టు విస్తరణ పనుల కోసం రామగిరి మండలంలోని బుధవారంపేట్ గ్రామంలో 17 సంవత్సరాల క్రితమే భూసేకరణ చర్యలు ప్రారంభించారు. గ్రామంలోని సుమారు 200 వందల మందికి చెందిన 708.16 ఎకరాల భూసేకరణకు డీఎన్‌డీడీ (డేట్‌ఆఫ్ నోటిఫికేషన్, డేట్‌ఆఫ్ డిక్లరేషన్) గెజిట్‌ను కూడా పాస్ చేశారు. దీని రెండేళ్ల కాలపరిమితి ముగిసినా అధికారులు భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయలేదు. దీన్ని మరో సంవత్సరం పొడిగించి రైతుల నుంచి ఎలాంటి సంతకాలు లేకుండా అవార్డుపాస్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. 708.16 ఎకరాల్లో, ఎకరాకు 1.75 లక్షలుగా నిర్ణయించడంతో పాటు అన్ని పరిహారాల కింద రూ. 4.35 లక్షలను చెల్లించడానికి భూసేకరణ అధికారులు ఖరారు చేశారు. వీటికి సంబంధించిన రూ. 37 కోట్ల పరిహారం సొమ్మును రామగుండం ఐసీఐసీఐ బ్యాంక్‌లో డిపాజిట్ కూడా చేశారు. ఈ క్రమంలో భూసేకరణ చట్టం 2013 ప్రకారం రైతులు తమ భూములతో పాటు గ్రామాన్ని తీసుకోవాలని ప్రతిపాదనలు చేశారు. గ్రామస్థుల ప్రతిపాదనలకు సింగరేణి ససేమిరా అనడంతో పరిహారం అందుకునేందుకు గ్రామస్థులు ఆసక్తి చూపలేదు.–గ్రామపంచాయతీ రికార్డుల సీజ్..ప్రాజెక్టు విస్తరణలో భాగంగా గ్రామాన్ని సైతం సేకరిస్తామని స్పష్టం చేస్తూనే... చేపడుతున్న భూసేకరణ సమయంలో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవద్దని సింగరేణి యాజమాన్యం అన్ని ప్రభుత్వశాఖలకు లేఖలు పంపింది. దీంతో గ్రామంలో అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. గ్రామంలో నూతనంగా ఎలాంటి నిర్మాణాలు జరగకుండా ముందస్తుగా గ్రామపంచాయతీ రికార్డులను సీజ్ చేశారు. దీంతో పదిహేడు సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధి నోచుకోవడం లేదు. 2017 సంవత్సరం వరకు రెవెన్యూ రికార్డుల్లో యాజమాన్యం హక్కులు కలిగిన రైతుల పేర్లను భూరికార్డుల శుద్ధీకరణలో భాగంగా తొలగించి సింగరేణి యాజమాన్యం పేరును రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారు. సింగరేణి భూసేకరణ స్పష్టత రాకపోవడంతో ఆ భూములను నేటికీ రైతులు సాగు చేసుకుంటున్నారు. కాగా గ్రామానికి సంబంధించిన 708.16 ఎకరాలు శుద్ధీకరణలో భాగంగా సింగరేణి యాజమాన్యపు హక్కును పొందడంతో ప్రభుత్వం కల్పించే పథకాలకు రైతులు అనర్హులయ్యారు. ప్రభుత్వం కల్పిస్తున్న రైతుబంధు, రైతు బీమా పథకాలు రైతులకు అందడం లేదు. ప్రతి యేటా రైతులకు పెట్టుబడి సహాయం రూ.70.81 లక్షలను గ్రామా రైతులు కొల్పోతున్నారు. రైతులు చనిపోయిన కుటుంబాలకు రైతు బీమా అందడం లేదు. పాస్‌బుక్కులేని రైతులకు బ్యాంకులు వ్యవసాయ రుణాలు కల్పించడం లేదు.– అవార్డు క్యాన్సిల్‌కు హైకోర్టులో అప్పీల్.. బుధవారంపేట్ గ్రామంలో భూసేకరణ చేపట్టిన 708.16 ఎకరాల భూమి సేకరణకు సంబంధించిన సింగరేణి అవార్డును క్యాన్సిల్ చేయాలని గ్రామస్థులు 2017లో హైకోర్టు అప్పీల్ చేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు కౌంటర్ పిటీషన్ దాఖలు చేయాలని సింగరేణికి ఆదేశాలు జారీ చేశారు. దీనిపై యాజమాన్యం ఇటీవలే కౌంటర్ పిటీషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. –రైతుబంధు పథకం వర్తింపజేయాలి




## బ్లాక్‌మెయిల్ చేయను: సీఎం ఎంపిక వేళ డీకే వ్యాఖ్య

దిల్లీ: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించినప్పటికీ.. కర్ణాటక సీఎం పీఠంపై కూర్చునేదెవరో తేలలేదు. ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ క్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్ దిల్లీకి వెళ్లడానికి ముందు మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తానెవరినీ వెన్నుపోటు పొడవనని, బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేయనని వెల్లడించారు. అలాగే తాను ఒక్కడినే దిల్లీకి వెళ్తున్నట్లు చెప్పారు. 'వచ్చే ఏడాది జరగనున్న లోకసభ ఎన్నికల్లో 20 సీట్లు గెలవడమే ప్రస్తుతం మా ముందున్న సవాలు. మాది ఉమ్మడి కుటుంబం. మా సంఖ్య 135. నేను ఎవరినీ విడదీయాలనుకోవడం లేదు. నేనొక బాధ్యతాయుతమైన వ్యక్తిని. ఎవరినీ వెన్నుపోటు పొడవను. బ్లాక్‌మెయిల్ చేయను. నా మీద ఎలాంటి మచ్చ లేకుండా చూసుకోవాలనుకుంటున్నా. పార్టీ వల్లే నేను ఈ స్థానంలో ఉన్నాను. పార్టీనే మా ఇల్లు. మేమంతా కలిసి దానిని నిర్మించుకున్నాం. ఆ ఇంటిలో నేనొక వ్యక్తిని. ఆ ఇంట్లో తల్లి.. బిడ్డకు ప్రతిదీ ఇస్తుంది. సోనియా గాంధీ మాకు రోల్ మోడల్. మాకు పార్టీ రాజ్యాంగం ముఖ్యం. కాబట్టి దాని ప్రకారమే అందరి ప్రయోజనాలు కాపాడాలి' అని శివకుమార్ అన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని తెలిపారు. పార్టీ నిర్ణయం ఏదైనా దానికి కట్టుబడి ఉంటాననేలా ఆయన వ్యాఖ్యలు నిపిస్తున్నాయి. కర్ణాటక ముఖ్యమంత్రిగా సీనియర్ నేత సిద్ధరామయ్యకే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. మరి ఈ సమయంలో పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు ఏ పదవి కట్టబెడతారనేది తెలియాల్సి ఉంది. తాజాగా వెలువడిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో డీకే కీలక పాత్ర పోషించారు. ఆయనపై ఉన్న ఈడీ, ఆదాయపు పన్ను కేసులే ఇప్పుడు అడ్డంకిగా మారినట్లు తెలుస్తోంది. ఆయన్ని ముఖ్యమంత్రిగా చేస్తే భాజపా నాయకత్వం మరింత గురిపెట్టి ఏదోవిధంగా ఇబ్బందికర పరిస్థితులు సృష్టించే అవకాశం ఉంటుందని, అందుకే సిద్ధూవైపే పార్టీ మొగ్గుచూపుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.




హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నేడు సీబీఐ విచారణకు హాజరుకాలేదు. ఈరోజు విచారణకు రావాల్సి ఉన్నప్పటికీ, ఆయన హాజరుకాకుండా సీబీఐ అధికారులకు లేఖ రాశారు. షార్ట్ నోటీసు ఇచ్చినందున.. విచారణకు మరింత సమయం ఇవ్వాలని అవినాష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముందస్తు కార్యక్రమాలు ఉన్నందున రాలేనని చెప్పారు. మరో నాలుగు రోజులు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉందని.. అందుకే విచారణకు హాజరయ్యేందుకు సమయం కావాలని సీబీఐకి రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. అనంతరం అవినాష్ పులివెందుల బయల్దేరి వెళ్లారు. మంగళవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని కార్యాలయానికి విచారణకు హాజరు కావాలని సోమవారం జారీ చేసిన నోటీసుల్లో సీబీఐ పేర్కొంది. సీఆర్‌పీసీ 160 సెక్షన్ కింద ఈ నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే పలుమార్లు అవినాష్‌రెడ్డిని ప్రశ్నించిన సీబీఐ.. గత 20 రోజులుగా విచారణ చేపట్టలేదు. తాజాగా కడప ఎంపీకి నోటీసులిచ్చి విచారణకు పిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. వివేకా కేసులో అవినాష్‌రెడ్డి పాత్ర, ప్రమేయంపై ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ కౌంటర్‌లో సీబీఐ స్పష్టంగా పేర్కొంది. ఈ కేసులో భారీ కుట్రకు అవినాష్, ఆయన తండ్రి వైఎస్ భాస్కరరెడ్డి, దేవిరెడ్డి శివశంకరరెడ్డి పాల్పడ్డారని పేర్కొన్న విషయం తెలిసిందే.




గాజువాక: విశాఖ ఉక్కు కర్మాగారం కార్మికులు కదం తొక్కారు. వేతనాలు పెంచాలంటూ స్టీల్‌ప్లాంట్ పరిపాలనా భవనాన్ని ముట్టడించారు. సెయిల్ తరహాలో తమకు వేతన సవరణ ఒప్పందం అమలుచేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌కు వెళ్లే అన్ని మార్గాల్లో బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో స్టీల్‌ప్లాంట్ కార్మికులు పరిపాలనా భవనం ముట్టడికి రావడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. దీంతో కార్మికులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆరేళ్లుగా వేతన ఒప్పందాన్ని అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారు.

## సంక్షేమ రథసారథి ముఖ్యమంత్రి వైయస్ జగన్

### సీఎం వైయస్ జగన్ చొరవతోనే ఆక్వా రంగం నిలదొక్కుకుంది

### బీసీ సామాజిక వర్గానికి చెందిన నన్ను అత్యున్నత సభలో కూర్చోబెట్టారు

### బీసీని రాజ్యసభకు పంపించిన కీర్తి, ఖ్యాతి సీఎం వైయస్ జగన్‌కే సొంతం

### వైయస్ఆర్ సీపీ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ

బాపట్ల: జాతీయ స్థాయిలో ఏ రాష్ట్రంలోనూ, ఏ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టలేనటువంటి అనేక రకాల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ రథసారథిగా గుర్తింపు తెచ్చుకున్నారని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ అన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలి, నిర్లక్ష్యానికి గురైన అన్ని వర్గాలకు చేయూతను అందించాలనే లక్ష్యంతో, ధృఢ సంకల్పంతో సహజవనరులను సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నంలో వరుసగా ఐదో ఏడాది వైయస్ఆర్ మత్స్యకార భరోసా సాయం విడుదల కార్యక్రమానికి ఎంపీ మోపిదేవి వెంకట రమణ హాజరై మాట్లాడారు. 'రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం గ్రామంలో వైయస్ఆర్ మత్స్యకార భరోసా సాయం విడుదల చేసేందుకు వచ్చినందుకు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు. మనవతా దృక్పథంతో, పదిమంది పేదలకు సాయం చేయాలనే ఆలోచనతో సీఎం వైయస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాల్లో మత్స్యకార భరోసా ఒకటి. కులవృత్తులను నమ్ముకొని సముద్రం మీద వేటకు వెళ్లే మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ సమయంలో ఆదుకోవడానికి ప్రభుత్వం ఇచ్చే సాయాన్ని గతానికి పదిరెట్లు అదనంగా పెంచి సాయం చేస్తున్నారు. ఐదో ఏడాది మత్స్యకార భరోసా పథకాన్ని ప్రారంభించేందుకు నిజాంపట్నం వచ్చారు. దేశంలోనే అత్యధిక సముద్రతీర ప్రాంతం ఉన్న రెండో రాష్ట్రం ఏపీ. అవకాశం ఉన్న ప్రతీచోట మేజర్ ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలు, ఎగుమతులు, దిగుమతులు చేసుకోవడానికి ఓడరేవుల నిర్మాణం చేపడుతున్నారు. ఆ దిశలో ఫేస్-1గా ఇప్పటికే జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఇప్పటికే సగం పనులు పూర్తిచేసుకొని ప్రారంభానికి సిద్ధం అవుతున్నాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటిగ్రేటెడ్ ఆక్వాల్యాబ్, ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్, ఆక్వా హ్యాచరీస్‌ను రూ.188 కోట్లతో 278 ఎకరాల్లో నిర్మాణం చేపట్టేందుకు సీఎం వైయస్ జగన్ శంకుస్థాపన చేశారు. పవర్ సబ్సిడీ




రూ.1.50 పైసలకు ఇవ్వడం వల్లే ఈ రోజు ఆక్వా రంగం నిలదొక్కుకుంటుంది. రేపల్లె నియోజకవర్గం కులవృత్తుల మీద ఆధారపడి జీవించే సామాజిక వర్గాలు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం. మత్స్యకారులు, గీత కార్మికులు, చేనేతలు ఉన్నారు. ఈ ప్రాంతాన్ని సీఎం వైయస్ జగన్ నాయకత్వంలో అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తారని నమ్మకం ఉంది.

**రేపల్లెకు సంబంధించి..** నియోజకవర్గానికి సంబంధించి సాగు, తాగునీరు ఇబ్బందులు ఉన్నాయి. మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి హయాంలో 9 లిఫ్ట్ ఇరిగేషన్లు పూర్తిచేసుకున్నాం. నిజాంపట్నం, అడవులదీవి, తుమ్మల ప్రాంతాలకు సాగునీరు ఇబ్బందులు ఉన్నాయి. లిఫ్ట్ ఇరిగేషన్ ఇవ్వాలని కోరుతున్నాం. తాగునీటికి సంబంధించి కొన్ని ప్రాజెక్టులు మంజూరయ్యాయి. వీటితో పాటు రహదారుల నిర్మాణానికి చెక్కవారిపల్లి వంతెన, ఈటీపీడ్రెయిన్ నిజాంపట్నం వంతెనకు సంబంధించి నిధులు మంజూరు చేయాలి. రాజకీయం అంటే ఏంటో తెలియని నాకు.. రాజకీయ అక్షరాభ్యాసం చేసి వెన్నుదన్నుగా నిలబడి ఆనాడు మండల ప్రెసిడెంట్‌నుంచి మీ కరుణతో ఎవరూ ఊహించని విధంగా రేపల్లె నియోజకవర్గానికి చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన నన్ను రాజ్యసభలో కూర్చోబెట్టిన ఖ్యాతీ సీఎం వైయస్ జగన్‌కే లభిస్తుంది.




## ఎంపీ అవినాష్ లేఖపై సీబీఐ రిప్లై... 19న విచారణకు రావాలని నోటీసులు

హైదరాబాద్: విచారణకు నాలుగు రోజులు సమయం కోరిన ఎంపీ అవినాష్ రెడ్డి లేఖపై సీబీఐ స్పందించింది. వాట్సాప్ ద్వారా మరోసారి నోటీసులు ఇచ్చింది. హైదరాబాద్ సీబీఐ కార్యాలయంలో ఈనెల 19న ఉదయం 11 గంటలకు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొంది. ఎంపీ అవినాష్.. హైదరాబాద్ నుంచి పులివెందుల వెళ్తుండగా మార్గమధ్యంలో సీబీఐ నోటీసులు పంపింది. సీఆర్‌పీసీ 160 సెక్షన్ కింద సోమవారం ఎంపీ అవినాష్‌కు సీబీఐ నోటీసులు జారీ చేయగా.. నాలుగు రోజులు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉన్నందున విచారణకు సమయం కోరుతూ లేఖ రాశారు. షార్ట్ నోటీసు ఇచ్చినందున.. విచారణకు మరింత సమయం ఇవ్వాలని అవినాష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముందస్తు కార్యక్రమాలు ఉన్నందున రాలేనని చెప్పారు. మరో నాలుగు రోజులు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉందని.. అందుకే విచారణకు హాజరయ్యేందుకు సమయం కావాలని సీబీఐకి రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. అనంతరం అవినాష్ పులివెందుల బయల్దేరి వెళ్లారు.

ఇప్పటికే పలుమార్లు అవినాష్‌రెడ్డిని ప్రశ్నించిన సీబీఐ.. గత 20 రోజులుగా విచారణ చేపట్టలేదు. తాజాగా కడప ఎంపీకి నోటీసులిచ్చి విచారణకు పిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. వివేకా కేసులో అవినాష్‌రెడ్డి పాత్ర, ప్రమేయంపై ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ కౌంటర్‌లో సీబీఐ స్పష్టంగా పేర్కొంది. ఈ కేసులో భారీ కుట్రకు అవినాష్, ఆయన తండ్రి వైఎస్ భాస్కరరెడ్డి, దేవిరెడ్డి శివశంకరరెడ్డి పాల్పడ్డారని పేర్కొన్న విషయం తెలిసిందే.




**తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు భారీగా తరలిరావడంతో క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి. రద్దీ పెరగటంతో టోకెన్లు లేని భక్తులకు స్వామివారి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్సులోని అన్ని కంపార్టుమెంట్లు, నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్లు నిండి శిలాతోరణం వరకు భక్తులు వేచి ఉన్నారు. రూ 300 ప్రత్యేక దర్శనం, కాలినడకన వచ్చే దివ్య దర్శన టికెట్లు కలిగిన భక్తులకు దాదాపు ఐదు నుంచి ఆరు గంటల సమయం పడుతోంది. క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు తితిదే సిబ్బంది తాగునీరు, అల్పాహారం అందిస్తున్నారు.**

## సీఎం జగన్‌కి సిగ్గు లేదు: సోము వీర్రాజు

విజయనగరం: ముఖ్యమంత్రి జగన్ (సీఎం జగన్)కి సిగ్గు లేదని, కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తుంటే జగన్ దొంగ ఫోటోలు తీసుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం వైసీపీ సర్కారు ప్రభుత్వ ఖజానా నుండి ఒక్క రూపాయి అయినా ఖర్చుపెట్టలేని దిక్కుమాలిన దుస్థితికి వచ్చిందన్నారు.

పారిశుధ్య కార్మికుల జీతాలు కూడా ఇవ్వలేని దౌర్భాగ్య రాష్ట్రం అని మండిపడ్డారు. టీడీపీ, జనసేన పొత్తుల అంశంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభిప్రాయాన్ని కేంద్రానికి వివరించానని తెలిపారు.



## జాబ్ క్యాలెండర్ ఎక్కడుంది?: కళా వెంకట్రావు



విశాఖ: ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న టీడీపీ అధినేత చంద్రబాబు పెందుర్తిలో పర్యటించనున్నారు. పెందుర్తిలో టీడీపీ నేతలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి టీడీపీ నేత కళా వెంకట్రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల పేరుతో వైసీపీ దోచుకుంటుందని ఆరోపించారు.

బ్రిటిష్ కాలం నాటి జీ.వో.లను తెచ్చి వేధిస్తున్నారని, టీడీపీ నేతలను అణగదొక్కాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నాలుగుసంవత్సరాలలో జగన్ ముఖ్యమంత్రి అవ్వడం వలన 40 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ ఎక్కడుంది? తాడేపల్లి గూడెంలో వుందా? అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఈనెల 17న పెందుర్తిలో చంద్రబాబు పర్యటన



విశాఖపట్నం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఈనెల 17న పెందుర్తిలో పర్యటించనున్నారు. ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు పెందుర్తికి రానున్నారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పెందుర్తిలో టీడీపీ నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కళా వెంకట్రావు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల పేరుతో దోచుకుంటున్న పార్టీ వైసీపీ అని అన్నారు. బ్రిటిష్ కాలం నాటి జీ.వో.ను జగన్ ఇప్పుడు తీసుకువచ్చారని మండిపడ్డారు. ఆనాడు బ్రిటిష్ వారు ఇటువంటి చట్టాలను తీసుకువచ్చి అల్లూరి సీతారామ రాజును చంపేశారని... అదేవిధంగా ఆ బ్రిటిష్ వారి పాలన లాగా తుగ్లక్ జీ.వో.లను తీసుకువచ్చారన్నారు. ప్రజలను ప్రజలకోసం పాటుపడే నాయకులను అణగదొక్కాలని చూస్తున్నారని మండిపడ్డారు. మతంతో గానీ పార్టీతో గానీ సంబంధం లేకుండా అందరూ పాల్గొని మద్దతు తెలపాలని కోరారు. ఈ నాలుగు సంవత్సరాలలో జగన్ ముఖ్యమంత్రి అవ్వడం వలన రాష్ట్రం 40 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందని తెలిపారు. జాబ్ క్యాలెండర్ ఎక్కడుంది? తాడేపల్లి గూడెంలో వుందా అంటూ ప్రశ్నించారు. రాబోయే 20 సంవత్సరాలలో జగన్ సారా త్రాగితే 60 సంవత్సరాలు బ్రతికే వ్యక్తి 20 సంవత్సరాలకే రోగాలపాలు అవుతున్నారన్నారు. సైలెంట్ కిల్లర్‌లు వైసీపీ నాయకులని.. నెమ్మదిగా ప్రభుత్వ భూములను దోచేస్తున్నారని ఆరోపించారు. ప్రజలతో మమేకమై వారిని ముందుకు నడిపించి, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి ద్వారా తెలియజేసి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రావాలని అందరూ కోరుకుంటున్నారని కళా వెంకట్రావు పేర్కొన్నారు.

## బికినీలో శ్రద్ధా కిల్లర్ లుక్ కి మతి చెడేనులే

ఆషిఖి 2 లో అద్భుత నటనతో మంత్రముగ్ధులను చేసింది శ్రద్ధా కపూర్. అప్ కమింగ్ గాయనిగా విరహ ప్రేమికురాలిగా శ్రద్ధా నటనకు యువతరం ప్రేమలో పడిపోతారు. కొన్ని వరుస బ్లాక్ బస్టర్లు అందుకున్న శ్రద్ధా కపూర్ అన్నివేళలా బాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ల జాబితాలో ఉంది. డార్లింగ్ ప్రభాస్ సరసన సాహో చిత్రంలో నటించి ఇటు దక్షిణాది యువత హృదయాలను గెలుచుకుంది. వెన్నెల్లో ఆడ పిల్లలా బంగారు బొమ్మలా కనిపించే శ్రద్ధా బికినీలో హొయలు పోవడంలోను తనదైన ప్రత్యేకతను చాటుకుంటుంది. శ్రద్ధా నెవ్వర్ బిఫోర్ హాట్ లుక్ ఇప్పుడు ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. బీచ్ పరిసరాల్లో వైట్ బికినీలో శ్రద్ధా టూ హాట్ గా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. ఇది లవ్ రాంజాన్ సినిమా నుంచి రిలీజైన హాట్ స్టిల్.



కెరీర్ ఆరంభమే ఆదిత్య రాయ్ కపూర్ తో కలిసి ఆషికి 2తో బ్లాక్ బస్టర్ అందుకున్న శ్రద్ధా తరువాత స్త్రీ- హైదర్- స్త్రీ- ఏక్ విలన్- చిచోరే- ABCD ఏ బాడీ కెన్ డ్యాన్స్ వంటి చిత్రాలలో పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇటీవల పెద్ద తెరపై కనిపించి కొంత గ్యాప్ వచ్చింది. శ్రద్ధ చివరిగా 2020 చిత్రం టైగర్ ష్రాఫ్- రితీష్ దేశ్ముఖ్ -అంకితా లోఖండేలతో కలిసి బాఘీ 3లో కనిపించింది. ఇదే కాకుండా.. నిఖిల్ ద్వివేది - విశాల్ ఫ్యూరియా నాగిన్ లో కూడా నటిస్తోంది. ఇది 1989 నాటి స్లాప్ స్టిక్ చిత్రం చాల్ బాజ్ కి మోడ్రన్ రీమేక్. శ్రద్ధా తన కెరీర్ లో ఎన్నడూ చూడని సరికొత్త అవతార్ లో కనిపించనుంది. ఈ చిత్రంలో ఆకారాన్ని మార్చుకునే సర్పకన్య పాత్రలో కనిపిస్తుంది. రణబీర్ కపూర్ - శ్రద్ధా కపూర్ జంటగా తదుపరి చిత్రం సెట్స్ లో ఉంది. త్వరలో ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఇటీవలే విడుదలైన ట్రైలర్ ఆకట్టుకుంది. దర్శకనిర్మాత లవ్ రంజన్ తెరకెక్కిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ టైటిల్ తు ఝూతి మైన్ మక్కార్. మొదటి ట్రైలర్ ఆద్యంతం లవ్ రొమాన్స్ ఫన్ ఎలిమెంట్స్ తో ఆకట్టుకుంది. ఇందులో రణబీర్ కపూర్ .. శ్రద్ధా కపూర్ డేటింగ్ ప్రేమ వ్యవహారాలు కట్టి పడేసే మ్యాజిక్ ని క్రియేట్ చేసాయి. తు ఝూతి మైన్ మక్కార్ ట్రైలర్ మోడ్రన్ యూత్ డేటింగ్ వ్యవహారాలకు సంబంధించిన సినిమా అని క్లారిటీనిచ్చింది. రణబీర్ కపూర్- శ్రద్ధా కపూర్ మొదటి సారి జంటగా నటించగాఈ మ్యూజికల్ రొమాంటిక్- కామెడీలో డింపుల్ కపాడియా .. బోనీ కపూర్ కూడా నటించారు.

## జాకీతో లవ్ లో ఉంటే నోరా అసూయ పడేది!

సుకేష్ చంద్రశేఖర్ మనీలాండరింగ్ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. 200 కోట్ల స్కామ్ కథలో రొమాంటిక్ లవ్ స్టోరీ ఔరా! అనిపిస్తోంది. ఇది కథానాయికలతో సుకేష్ ముక్కోణపు ప్రేమకథ గుట్టును బట్టబయలు చేసింది. తన నుంచి బహుమతులు అందుకున్న ఇద్దరు బాలీవుడ్ కథానాయికలతో సుకేష్ ప్రేమాయణం ఇప్పుడు మతులు చెడగొడుతోంది. తాజా ఇన్వెస్టిగేషన్ లో సుకేష్ చంద్రశేఖర్ స్వయంగా వెల్లడించిన విషయాలు విస్మయానికి గురి చేస్తున్నాయి. తాజాగా కాన్ మాన్ సుకేష్ మీడియాకు ఒక ప్రకటనను షేర్ చేసాడు. అందులో అతడు నోరా ఫతేహి- జాక్వెలిన్ ఫెర్నాండెజ్ సహా పలువురి



గురించి కొన్ని షాకింగ్ విషయాలను వెల్లడించాడు. వివరాల్లోకి వెళితే.. సుకేష్ చంద్రశేఖర్ మీడియాతో తాజా ప్రకటనలో ఇద్దరు భామలతో అందమైన ప్రేమ కథను బహిర్గతం చేసాడు. అందాల కథానాయిక జాక్వెలిన్ ఫెర్నాండెజ్ పై నోరా ఫతేహి అసూయపడిందని వెల్లడించాడు. ప్రస్తుతం ఈ కేసులో ప్రమేయం ఉన్న అందాల కథానాయికలు ఇద్దరినీ ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి) విచారిస్తోంది. సుకేష్ తన ప్రకటనలో నిక్కీ తంబోలి- చాహత్ ఖన్నా వంటి నటీమణుల గురించి కూడా మాట్లాడారని గుసగుస వినిపిస్తోంది. అంతేకాదు..నోరా తన ప్రేయసి జాక్వెలిన్ ను చూసి అసూయపడిందని సుకేష్ చెప్పారు. మీడియాతో సుకేష్ సుదీర్ఘ ప్రకటనలో పలు రహస్యాలు బహిర్గతమయ్యాయి. నటీమణులిద్దరికీ అబద్దాలు చెప్పి తన వైపు మలుచుకున్నది నిజమే అయినా.. నోరా ఫతేహి- జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తనపై మోపిన ఆరోపణలను సుకేష్ ఖండించారు. జాక్వెలిన్ ను చూసి నోరా అసూయపడుతుందని చెప్పాడు. తన లేఖలో సుకేష్ చంద్రశేఖర్ చాలా విషయాలు వెల్లడించారు.




## మహేశ్ బాబుతో శ్రీలీల చిందులు





అతడు ఖలేజా లాంటి సూపర్ హింట్ మూవీస్ తర్వాత హీరో మహేష్బాబు దర్శకుడు త్రివిక్రమ్ కాంబోలో ఓ సినిమా వస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే కొంత పూర్తి అయింది. త్రివిక్రమ్ శైలి ఫన్ ఫ్యామిలీ ఎమోషన్స్తో ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. ఈ భారీ బడ్జెట్ సినిమా షూటింగ్ గత ఏడాది ప్రారంభం అయింది. అయితే తన తల్లి ఇందిరాదేవీ మరణించింది. అయితే నవంబరులో సెకండ్ షెడ్యూల్ తెరకెక్కించాలని అనుకున్నారు. కానీ అప్పుడు సూపర్ స్టార్ కృష్ణ మరణించారు. దీనితో ఈ సినిమా షూటింగ్ ఆగిపోయింది. పలు మార్లు ఈ సినిమా షూటింగ్ వాయిదా పడుతూ రాగా.. చివరకు జనవరిలో ఈ సినిమా షూటింగ్ మళ్లీ మొదలు అయినట్లు తెలుస్తోంది. అయితే ఈ సినిమాలో మహేశ్ కు జోడీగా పూజహెగ్డే నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల శ్రీలీల కూడా హీరోయిన్ గా చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే తాజా విషయం ఏమిటి అంటే... ఈ సినిమాలో మహేశ్ బాబుకు శ్రీలీలకు ఒక ఫోక్ సాంగ్ ఉంటుందని తెలుస్తోంది. ఓ రేంజ్ లో ప్లాన్ చేస్తున్నట్లు ఓ వార్త బయటకు వచ్చింది. ఇక ఈ సినిమాను SSMB 28 వర్కింగ్ టైటిల్గా ఫిక్స్ చేశారు. ఈ సినిమాను ఏప్రిల్ 28న రిలీజ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ అనౌన్స్ చేసినా.. షూటింగ్లో ఆలస్యమవడంతో రిలీజ్ డేట్ వాయిదా పడటం ఖాయమని తెలుస్తోంది. వేసవి తర్వాతే ఈ సినిమాను రిలీజ్ చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే 'అత్తారింటికి దారేది' సినిమాలోని 'కాటమరాయుడా' సాంగ్ 'అజ్ఞాతవాసి' సినిమాలోని 'కొడకా కోటేశ్వరరావా' అరవింద సమేతలో 'రెడ్డమ్మ తల్లి' అల..వైకుంఠపురములో 'సిత్తరాల సిరపడు' లాంటి పాటలు జానపదాలను గుర్తు చేసి.. ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. సోషల్ మీడియాలోనూ రికార్డులు సృష్టించాయి. ఇప్పుడు ఈ పాటతో ఎలాంటి రికార్డ్స్ సృష్టిస్తారో చూడాలి. మహేష్బాబు హీరోగా నటిస్తోన్న 28వ సినిమా ఇది. ఎస్ఎస్ఎంబీ 28 వర్కింగ్ టైటిల్తో రూపొందుతోన్న ఈ సినిమాకు తమన్ సంగీతాన్ని అందిస్తున్నాడు. అల వైకుంఠపురములో అరవింద సమేత వీర రాఘవ తర్వాత తివిక్రమ్ దర్శకత్వంలో పూజాహెగ్డే నటిస్తోన్న సినిమా ఇది. హారిక హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్ రాధాకృష్ణ నిర్మిస్తున్నారు.

ఈ సినిమా పూర్తి అయిన తర్వాత రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు తన 29 వ సినిమా చేయనున్నారు. ఆర్ఆర్ఆర్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాజమౌళి... ఈ సినిమాను హాలీవుడ్ రేంజ్ లో తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## డాడీలో మెగాస్టార్ కూతురు ఇప్పుడెలా ఉందో తెలుసా?



మెగాస్టార్ చిరంజీవి సిమ్రాన్ కాంబినేషన్ లో వచ్చిన సూపర్ హిట్ సినిమా డాడీ. తండ్రి కూతుళ్ళ సెంటిమెంట్ తో తెరకెక్కిన ఈ సినిమాని సురేష్ కృష్ణ తెరకెక్కించారు. ఈ మూవీలో చిరంజీవి కూతురుగా డ్యూయల్ రోల్ లో నటించిన బాలనటిని అందరూ చూసే ఉంటారు. డాడీ సినిమాలో చిన్నా క్యూట్ యాక్టింగ్ కి అందరూ ఫిదా అయిపోయారు. 2001లో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఇక ఈ సినిమా తర్వాత ఆ చిన్నారి తెలుగులో మళ్ళీ నటించలేదు. హిందీలో ఈ చిన్నారి ఒక సినిమాలో నటించింది. ఈ చిన్నారి పేరు అనుష్క మల్హోత్రా. ఈ చిననారి ఆ రెండు సినిమాల తరువాత మూవీస్ కి గుడ్ బై చెప్పేసి చదువుల మీద దృష్టి పెట్టింది. మళ్ళీ సినిమా ఇండస్ట్రీ వైపు దృష్టి పెట్టలేదు. ప్రస్తుతం యుక్త వయస్సులో ఉన్న ఈ చిన్నారి బ్యూటీ హీరోయిన్స్ కి ఏ మాత్రం తీసిపోని అందంతో మెరిసిపోతుంది. అయితే హీరోయిన్ గా రాణించాలని ఈ బ్యూటీకి కోరిక లేకపోవడంతో బీలండన్ వెళ్లిపోయి అక్కడ డిగ్రీ చేసి తన ఇష్టమైన ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. ప్రస్తుతం లండన్ లో ఉంటున్న అనుష్క మార్కెటింగ్ స్ట్రాటజిస్ట్ గా రాణిస్తుంది. అయితే సినిమాలు వదిలేసి అక్కడ సెటిల్ కావడంతో అనుష్క మల్హోత్రా గురించి ఎవరికి తెలియలేదు. బాలీవుడ్ లో ఈ బ్యూటీకి అవకాశాలు వచ్చిన కూడా తిరస్కరించినట్లు తెలుస్తుంది. ఈ జెనరేషన్ లో చైల్డ్ ఆర్టిస్ట్ గా రాణించిన చాలా మంది హీరోయిన్స్ గా తరువాత అడుగుపెట్టి సక్సెస్ అయ్యారు. నిత్యా మీనన్ కీర్తి సురేష్ అనూ ఇమ్మాన్యుయేల్ లాంటి భామలు సౌత్ లో స్టార్ హీరోయిన్ గా రాణిస్తున్నారు. అలాగే మరికొంత మంది భామలు ఒకటి అర సినిమాలలో కనిపించి మాయమయ్యారు. రీసెంట్ గా గంగోత్రి సినిమాలో నటించిన చిన్నారి కూడా మసూద అనే సినిమా ద్వారా హీరోయిన్ గా తెరంగేట్రం చేస్తుంది. అయితే చిన్న వయస్సులోనే అభినయంతో అదరగొట్టి ప్రస్తుతం అందంతో మెరిసిపోతున్న అనుష్క మల్హోత్రా మాత్రం హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వకపోవడం విశేషం అని చెప్పాలి. భవిష్యత్తులో అయిన ఈ బ్యూటీ ఆ దిశగా అడుగులు వేసి నటిగా తెరంగేట్రం చేస్తుందేమో చూడాలి.

## మెగాస్టార్ మనవరాలు ఆ విషయమై క్లారిటీ ఇచ్చేసింది

బాలీవుడ్ మెగాస్టార్.. బిగ్ బి అమితాబచ్చన్ ఫ్యామిలీ నుండి ఆయన మనవరాలు నవ్య నవేలి హీరోయిన్ గా ఎంట్రీ ఇవ్వబోతున్నారు అంటూ జాతీయ మీడియాలో చాలా రోజులుగా ప్రచారం జరుగుతోంది. సోషల్ మీడియాలో ఆమె రెగ్యులర్ గా పోస్ట్ లు పెట్టడంతో పాటు సెలబ్రిటీ తరహాలో సందడి చేయడం జరుగుతుంది. సినిమా కార్యక్రమాలకు అప్పుడప్పుడు హాజరు అవ్వడం.. ఇండస్ట్రీకి చెందిన ఆమె సన్నిహితుల యొక్క కార్యక్రమాలకు కూడా ఆమె హాజరు అవుతున్న కారణంగా ఇండస్ట్రీలో అడుగు పెట్టేందుకు ఆమె ఇలా సెలబ్రెటీ పార్టీలకు హాజరు అవుతున్నారు అనే వార్తలు జోరుగా సాగుతున్నాయి. అమితాబ్ యొక్క మనవరాలు ఇండస్ట్రీలో అడుగు



ఎప్పుడు పెడతారు.. ఏ సినిమా తో ఆమె ఇండస్ట్రీలో అడుగు పెడతారు అంటూ ఆసక్తిగా ఎదురు చూస్తున్న బిగ్ బి అభిమానులకు నవ్య నవేలి షాక్ ఇచ్చారు. తాను హీరోయిన్ గా ఇండస్ట్రీలో అడుగు పెట్టాలని భావించడం లేదు. అసలు నాకు నటనపై ఆసక్తి లేదు అంటూ ఫుల్ క్లారిటీ ఇచ్చింది. ఇప్పటి వరకు నన్ను ఏ ఒక్కరు కూడా హీరోయిన్ పాత్రకు సంప్రదించలేదు అని కూడా ఆమె పేర్కొంది. ప్రస్తుతానికి తాను సినిమాల గురించి ఆలోచించడం లేదని పేర్కొంది. ఆరా హెల్త్ ఆర్గనైజేషన్ పేరుతో స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తున్న నవ్య నవేలి ఎంతో మంది మహిళల యొక్క పరిశుభ్రత మరియు ఆరోగ్యం విషయంలో సహాయం చేస్తున్నారు. ఈ స్వచ్ఛంద సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశ్యం మహిళలను ఆరోగ్యం విషయంలో విద్యావంతులుగా మార్చడం అంటూ ఆమె పలు సందర్భాల్లో పేర్కొన్నారు.

## డర్టీ బ్యూటీ చీర కట్టడం మరిచింది.. మతి పోగొడుతున్న క్లీ వేజ్ షో

చీర కట్టులో ఉన్నంత అందం మరే మోడ్రన్ డ్రస్ లో ఉండదు అంటారు. చీర కట్టులో ఉన్నంత రొమాంటిక్ యాంగిల్ మరే డ్రెస్ లో కూడా ఉండదు అంటూ చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చీర కట్టులో కనిపించే అందాల కంటే మరింత అందంగా రుహాని శర్మ కనిపిస్తూ ఆకట్టుకుంటూ ఉంది. రుహాని శర్మ అందాల ఆరబోత విషయంలో మొన్నటి వరకు ఒక హద్దులో ఉండేది. కానీ ఇప్పుడు అభిమానుల డిమాండ్ మేరకు కావచ్చు అందాల ఆరబోత విషయంలో బాలీవుడ్ హీరోయిన్స్ తో పోటీ పడుతోంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఈ ఫొటోలు తెగ వైరల్ అవుతున్నాయి.



నడుము నాభి అందాలను చీర కట్టులో చూపిస్తూ క్లీ వేజ్ షో చేస్తూ ఉంటే మతి పోతూ ఉంటుంది. కానీ రుహాని శర్మ చీర కట్టుకోవడం మర్చి పోయిందా అన్నట్లుగా ఫుల్ గా క్లీ వేజ్ షో చేస్తూ నడుము నాభి అందాన్ని సాధ్యం అయినంత ఎక్కువగా చూపిస్తూ మతి పోగొడుతుంది. వయ్యారంగా అలా నిలబడి చూస్తూ ఉంటే ఎంతటి వారికైనా గుండె జారి గల్లంతు అవ్వాల్సిందే. ఈ అమ్మడి అందాల ఆరబోత ఈ స్థాయిలో చేయడం ఇదే ప్రథమం. చీర కట్టకుండా ఇంతగా నడుము నాభి చూపించి క్లీవేజ్ షో చేసినా కూడా వెగటుగా లేకుండా ఇంపుగా.. అందంగా ఉందని.. ఇలాంటి ఫొటో లు మరికొన్ని షేర్ చేస్తే ఫిల్మ్ మేకర్స్ ఈ అమ్మడి వెంట డేట్ల కోసం అడ్వాన్స్ లు పట్టుకుని తిరిగే రోజులు వస్తాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# ఈఎంఆర్ఐ 108 సంస్థలో డ్రైవర్, ఈఎంటి ఉద్యోగ దరఖాస్తుల ఆహ్వానం...

ఈఎంఆర్ఐ 108 సంస్థ నందు క్యాపిటన్ డ్రైవర్, ఈఎంటి (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) ఉద్యోగాల కొరకు ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా సదరు సంస్థ తెలిపింది. కావున ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్ జిరాక్స్ సెట్ వెంట తీసుకొని ఈనెల 20 అనగా 20-5-2023 వ రోజున ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు 108 ఆఫీస్, ఎంపీడీవో ఆఫీస్ మేడ్చల్ వద్ద హాజరు కావలసిందిగా ఏఎన్ఆర్ఐ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. అరహత వివరాలను తప్పక తెలుసుకొని, అరుహులైన్ వారు మాత్రమే సంప్రదించవల్సిందిగా తెలిపారు. మరింత సమాచారం కొరకు ఫోన్ నంబర్ 9100799264 ద్వారా సంప్రదించవలసిందిగా సూచించారు.



విద్యార్థులపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఏబీవీపీ నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విద్యార్థులతో మాట్లాడి.. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



# నిప్పుల కొలిమిలా తెలుగు రాష్ట్రాలు

దిల్లీ: భారత్‌లోకి నైరుతి రుతుపవనాల రాక కాస్త ఆలస్యం కానుంది. జూన్ 4వ తేదీ నాటికి అవి కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. నైరుతి రుతుపవనాలు సాధారణంగా జూన్ 1 నాటికి కేరళలో ప్రవేశిస్తాయి. అయితే, ఈ ఏడాది నాలుగు రోజులు ఆలస్యంగా జూన్ 4న ప్రవేశించే అవకాశం ఉందని మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. గతేడాది మే 29 నాటికే అవి కేరళ తీరానికి చేరుకున్నాయి. 2021లో జూన్ 3న, 2020లో జూన్ 1న ప్రవేశించాయి. ఎల్ నినో పరిస్థితులు ఏర్పడినప్పటికీ.. భారత్‌లో ఈసారి సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం గత నెలలో వెల్లడించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. భారత్‌లో వర్షపాతం ప్రధానంగా రుతుపవనాల వల్ల సంభవిస్తుంది.

దేశ వ్యవసాయ రంగానికి ఇవి ప్రధాన ఆధారం. సాగు విస్తీర్ణంలో 52 శాతం రుతుపవనాలపైనే ఆధారపడి ఉంటుంది. ఇది దేశ మొత్తం ఆహారోత్పత్తిలో 40 శాతం వాటా. తద్వారా దేశ ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వానికి కీలకమైన సహకారం లభిస్తుంది.

**19 నుంచి గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం: వాతావరణశాఖ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. భానుడి సెగలకు జనం అల్లాడిపోతున్నారు.

సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉత్తర, ఈశాన్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుంటే మిగతా జిల్లాల్లో సాధారణం కన్నా ఒకటి నుంచి రెండు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ సంచాలకులు డాక్టర్ నాగరత్న తెలిపారు. ఈనెల 19 నుంచి వేడి వాతావరణంతో పాటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వెల్లడించారు.

**నిప్పుల కొలిమిలా మారిన ఆంధ్రప్రదేశ్ :** వాయువ్య భారత్ నుంచి వీస్తున్న ఉష్ణగాలుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ నిప్పుల కొలిమిని తలపిస్తోంది. భానుడి ప్రతాపానికి తోడు వడగాల్పులు రాష్ట్రంలోని ఉష్ణోగ్రతల తీవ్రతను గరిష్ఠానికి చేర్చాయి. కోస్తాంధ్ర, రాయలసీమల్లోని అన్ని ప్రాంతాల్లోనూ పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువగా నమోదవుతున్నాయి. ప్రత్యేకించి కోస్తాంధ్రలోని ఉభయగోదావరి నుంచి నెల్లూరు వరకు ఉష్ణగాలుల ప్రభావం తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. అత్యధికంగా రాజమహేంద్రవరం గ్రామీణ ప్రాంతంలోని ధవళేశ్వరం వద్ద 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటలో 46.49 డిగ్రీలు, గుంటూరు జిల్లా పొన్నూరులో 46.2, తూర్పుగోదావరి 46.06, శ్రీకాకుళం, బాపట్ల, కోనసీమ, గుంటూరు, కాకినాడ, కృష్ణా, ఏలూరులో 46 డిగ్రీల చొప్పున, నెల్లూరు, పల్నాడు, తిరుపతి, మన్యం, నంద్యాల, విజయనగరం, పశ్చిమగోదావరి, అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో 45 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ దాదాపుగా 40-44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలంతా వేడిమికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాగల రెండు మూడు రోజుల పాటు కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఇదే పరిస్థితి నెలకొనే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది.

# అన్ని వర్గాలతో కేసీఆర్ సర్కార్ ఆటలాడుతోందన్న బీజేపీ నేత

హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలతో ఆటలాడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కౌన్సిలింగ్ ప్రారంభం కాకుండానే ఇంజనీరింగ్ అడ్మిషన్ల దందా చేస్తారా అని ప్రశ్నించారు. ప్రైవేటు వర్శిటీ హోదా రాకుండానే గురునానక్, శ్రీనిధి కాలేజీల్లో 4 వేల మందికి అడ్మిషన్లు ఎలా ఇస్తారని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వం డబ్బులకు అమ్ముడుపోయి విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తోందన్నారు. ప్రమోషన్లకు అమ్ముడుపోయిన కొందరు పోలీసులు ఏబీవీపీ నాయకులను వేధిస్తున్నారని మండిపడ్డారు. ఉన్నత విద్యా మండలి ఎదుట ధర్నా చేస్తే తమకొచ్చిన నొప్పేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై థర్డ్ డిగ్రీ ఉపయోగిస్తారా అని మండిపడ్డారు. తక్షణమే ఏసీపీ సహా పోలీసులపై చర్యలు తీసుకోవాల్సిందే అని డిమాండ్ చేశారు. ఈటల రాజేందర్ తమ పార్టీ నాయకుడని... జాతీయ నాయకత్వాన్ని కలవడానికి వెళితే తప్పేందని ప్రశ్నించారు. దళితులను తిట్టిన మంత్రి శ్రీనివాస్ గౌడ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాల్సిందే అని పట్టుబట్టారు. అంబేద్కర్ లేకుంటే ఆయనది బిచ్చపు బతుకయ్యేదనే సంగతి తెలుసుకుంటే మంచిది అంటూ బండి సంజయ్ పేర్కొన్నారు.

# ఆత్మగౌరవ భవనాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి : మంత్రి గంగుల



హైదరాబాద్ : సీఎం కేసీఆర్ సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవ భవనాలను నాణ్యాతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బీసీ సంఘాల నేతలతో కలిసి కోకాపేట ఆత్మగౌరవ భవన నిర్మాణ సముదాయంలో పర్యటించారు. రెవెన్యూ, హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ తదితర విభాగాల పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ రోడ్లతో పాటు సమాంతరంగా ఎలక్ట్రిసిటీ, వాటర్ వర్క్స్ పనులను పూర్తిచేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వేలకోట్ల విలువైన స్థలాలను హైదరాబాద్ నడిబొడ్డున కోకాపేట్, ఉప్పల్ భగాయత్ వంటి ప్రాంతాల్లో బీసీలకు కేటాయించారని, వీటి నిర్మాణంలో సైతం ఆయా కుల ఏక సంఘాల ట్రస్టులకే బాధ్యత అప్పగించామన్నారు. మొత్తం 87.3 ఎకరాల్లో 95.25 కోట్లతో 41 కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలను కేటాయించామని, కోకాపేటలో యాదవ, కురుమ ఆత్మగౌరవ భవనాలు ఇప్పటికే నిర్మాణం పూర్తయ్యాయని వెల్లడించారు. మిగతా భవనాల నిర్మాణాలకు అవసరమైన మౌలిక సదుపాయాల్ని వేగంగా అందజేస్తూ వాటిని సైతం త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే మున్నూరు కాపు, ముదిరాజ్, గౌడ, బసవేశ్వర భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. అనంతరం మున్నూరుకాపు ఆత్మగౌరవ భవనం డిజైన్లను మంత్రి పరిశీలించారు.

కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య, నాయకులు చల్లా హరిశంకర్, బీసీ సంక్షేమ శాఖ జేడీ చంద్రశేఖర్, డీడీలు సంధ్య, విమలాదేవి, వాటర్ వర్క్స్ డీఈ నరహరి, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ వెంకన్న, హెచ్ఎండీఏ అధికారి ప్రవీణ్, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యం: మంత్రి తలసాని



హైదరాబాద్: ప్రజల ఆరోగ్య సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. ఇవాళ గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని గన్ ఫౌండ్రీలో గల నేతాజీ కమ్యూనిటీ హాల్‌లో, జంబాగ్ డివిజన్‌లోని సుబాన్‌పురా కమ్యూనిటీ హాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానలను మంత్రి శ్రీనివాస్ యాదవ్.. %మీూా% రాజాసింగ్, %వీూజ% మీర్జా రహమత్ బేగ్‌లతో కలిసి ప్రారంభించారు. గన్ ఫౌండ్రీ బస్తీ దవాఖానాలో మంత్రికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వైద్య సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి చెప్పారు. పేద ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో ఈ బస్తీ దవాఖానలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. %+ఎవీజ% పరిధిలో ఇప్పటి వరకు 350 బస్తీ దవాఖానల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో ఇప్పటికే 153 బస్తీ దవాఖానలు పని చేస్తుండగా, నూతనంగా 14 బస్తీ దవాఖానలు ప్రారంభించనున్నట్లు వివరించారు. బస్తీ దవాఖానలలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా మందులు కూడా ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు మంత్రి తలసాని. అవసరమైతే గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి ఆసుపత్రులకు రిఫర్ చేస్తారని అన్నారు. వైద్య సేవల కోసం పేద ప్రజలు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వందల కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. బస్తీ దవాఖానల ఏర్పాటు తర్వాత వైద్య పరీక్షల కోసం ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్ళేవారి సంఖ్య గణనీయంగా తగ్గిందని చెప్పారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి CT స్కాన్, MRI స్కాన్, క్యాత్ ల్యాబ్ వంటి అత్యాధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. అన్ని రకాల వైద్య సేవలు, గుండె మార్పిడి, మోకాళ్ళ చికిత్స, కిడ్నీ మార్పిడి వంటి అనేక ఆపరేషన్‌లను ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగానే చేస్తున్నట్లు వివరించారు. వేలాది రూపాయల విలువైన టెస్టులను కూడా ఉచితంగానే చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకట్, కార్పొరేటర్‌లు సురేఖ, రాకేశ్ జైశ్వాల్, మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్తా, డాక్టర్ మేరీ, BRS నియోజకవర్గ ఇన్‌ఛార్జి నందకిషోర్ వ్యాస్, నాయకులు ఆనంద్ గౌడ్, ధన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య ఉపాధి కోసం.. ప్రభుత్వ ఉద్యోగం కోసం కాకూడదు : మంత్రి జగదీష్ రెడ్డి

సూర్యాపేట : పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి జిల్లా గ్రంథాలయానికి వస్తున్న యువతకు సొంత ఖర్చులతో భోజనం ఏర్పాటు చేస్తానని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని మంత్రి ఆకస్మికంగా సందర్శించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ యువకులతో ఆయన మాట్లాడారు. 1980 నుంచి 1985 వరకు గ్రంథాలయం లోని స్వీయ అనుభవాలను వారితో పంచుకున్నారు. విద్య ఉపాధి కోసమని ఉద్యోగం కోసం కాకూడదని హితవు పలికారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పడాలని, అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగమే పరమావధి కాకూడదని సూ



చించారు. మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

అందుకు అవసరమైన ఓరియంటేషన్ శిక్షణకు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. వేసవి తాపం నుంచి రక్షణగా ఉండేలా కూలర్లు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీచేశారు. జిల్లా కేంద్రంలో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన గ్రంథాలయ భవనాన్ని నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# ఆ గుణపాఠంతోనైనా బీజేపీ ఇక మారాలి



నల్గొండ: కర్ణాటక ఫలితాల తర్వాతైనా బీజేపీకి జ్ఞానోదయం కలగలేదని.. ఆ గుణపాఠంతోనైనా ఇక మారాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ గెలిచినా అంతర్గత కుమ్ములాటలతో సీఎంను ఎన్నుకునే పరిస్థితి లేదన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వమే శరణ్యం తప్ప మరొకటి లేదనే భావనలో ప్రజలున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పట్ల అప్రమత్తంగా ఉండాలని.. వారికి ఒక్క ఓటు వేసినా రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరే అని వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రంలో జరుగుతున్న కార్యక్రమాలు కొనసాగలంటే మళ్లీ కేసీఆర్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. మతోన్మాద బీజేపీకి, ఓటేసి గెలిపించినా కుమ్ములాటలతో మారని కాంగ్రెస్ పార్టీలకు దూరంగా ఉండాలని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.

# నల్లగొండ జిల్లాలో 103 కిలోల గంజాయి స్వాధీనం.. ఆరుగురు అరెస్ట్



నల్లగొండ : నల్లగొండ జిల్లా పరిధిలోని కేతెపల్లిలో 103 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ. 10 లక్షల విలువ చేస్తుందని పోలీసులు నిర్ధారించారు. అరెస్టు అయిన వారిలో ఒడిశాకు చెందిన అశోక్ తారఫర్, అభిజీత్ తారఫర్, ఫణి తారఫర్, శిఖా బిస్వాల్, ధనుంజయ్ బిస్వాల్, మధ్యప్రదేశ్‌కు చెందిన జీవన్ సింగ్ యాదవ్ ఉన్నారు. వినయ్, వివేక్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా నల్లగొండ ఎస్పీ అపూర్వ రావు మాట్లాడుతూ.. టాస్క్ ఫోర్స్, కేతెపల్లి పోలీసులు సంయుక్తంగా కలిసి కోర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టారని తెలిపారు. ఓ బస్సును తనిఖీ చేస్తుండగా ఎనిమిది మంది వ్యక్తులు బస్సు దిగి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా, వారిలో ఆరుగురిని పట్టుకున్నారు. ఆరుగురు నిందితుల నుంచి 103 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి : ఎమ్మెల్యే జోగు రామన్న




హైదరాబాద్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు వివరించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గత తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. అరవై ఎనిమిది సంవత్సరాలు పాలించిన గత ప్రభుత్వాలు ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించలేకపోయాయని విమర్శించారు. తెలంగాణ సాధించిన తొమ్మిదేండ్ల కాలంలోనే దేశానికే ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. స్థానిక బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ క్రియాశీలకంగా పని చేయాలని సూచించారు. ఈ సమ్మేళనంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, నాయకులూ అష్రఫ్, సాజిదోద్దీన్, సలీం,స్వరూప రాణి, బొడగం మమత, బుట్టి శివకుమార్ పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com